విలేకరులు కావలెను

సీనియర్ జర్నలిస్టుల సారథ్యంలో వస్తున్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.

99492 22450


ప్రభాత సూర్య
www.suryaa.news



ప్రభాత సూర్య
PRABHATA SURYA
తెలుగు దిన పత్రిక
www.suryaa.news

హైదరాబాద్
2-1-2026
వెల: రూ.5/-
పేజీలు: 8
సంపుటి: 01
సంచిక: 152

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

# భవిష్యత్ వృద్ధే లక్ష్యంగా..

## ఆర్భాటాలకు దూరంగా నిర్మాణాత్మక పెట్టుబడులు

- తయారీ రంగం, ఉపాధి సృష్టిపై స్పష్టమైన దృష్టి
- మౌలిక సదుపాయాలకు రికార్డు స్థాయి మూలధన వ్యయం
- పన్ను శ్లాబుల్లో స్థిరత్వం.. రక్షణకు భారీ ప్రాధాన్యం
- సంస్కరణల ప్రయాణాన్ని వేగవంతం చేస్తామన్న కేంద్రం

₹

**అంతర్జాతీయంగా రాజకీయ, ఆర్థిక అనిశ్చితులు పెరుగుతున్న తరుణంలోనూ దేశ ఆర్థిక వ్యవస్థను స్థిరమైన వృద్ధి మార్గంలో ముందుకు నడిపించాలన్న సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం 202627 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర బడ్జెట్‌ను రూపొందించింది. స్వల్పకాలిక ఆకర్షణలకు కాకుండా దీర్ఘకాలిక అభివృద్ధే లక్ష్యంగా రూపుదిద్దుకున్న ఈ బడ్జెట్‌లో తయారీ రంగ స్వావలంబన, ఉపాధి కల్పన, మౌలిక సదుపాయాల విస్తరణకు కేంద్రం ప్రాధాన్యం ఇచ్చింది. స్వాతంత్ర్యం అనంతరం వందేళ్లు పూర్తయ్యే నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలన్న దృఢ సంకల్పానికి అనుగుణంగా ఈ ఆర్థిక ప్రణాళికను ప్రభుత్వం పార్లమెంట్ ముందుంచింది.**



మొత్తం రూ.53.47 లక్షల కోట్ల వ్యయంతో ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి భారీ కేటాయింపులు చేశారు. తయారీ, ఔషధాలు, సెమీకండక్టర్లు వంటి కీలక రంగాల్లో ఉత్పాదకత పెంపు ద్వారా ఉద్యోగ అవకాశాలను విస్తరించాలన్న లక్ష్యాన్ని స్పష్టంగా పేర్కొన్నారు. ఆదాయపు పన్ను శ్లాబుల్లో ఎలాంటి మార్పులు చేయకపోయినా, కొత్త ఆదాయపు పన్ను చట్టం 2025ను ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి తీసుకురానున్నట్లు ప్రకటించారు.

### ఉపాధి కేంద్రంగా ఆర్థిక ప్రణాళిక

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తొమ్మిదోసారి వరుసగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం ఈసారి మరో ప్రత్యేకత. విత్త నియంత్రణకు కట్టుబడి ఉండేలా పద్దును రూపొందించిన ఆమె, ఉపాధి కల్పనతో పాటు ఉత్పాదకత పెంపునే ప్రధాన అక్షంగా చేసుకున్నారు. పర్యాటకం, రక్షణ ఉత్పత్తులు, ఔషధ పరిశ్రమల ద్వారా దేశాన్ని గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దే ప్రణాళికలను ప్రకటించారు. ప్రపంచవ్యాప్తంగా సరఫరా గొలుసులు దెబ్బతింటున్న పరిస్థితుల్లో స్వదేశీ తయారీ సామర్థ్యాన్ని పెంచుకోవడం అత్యవసరమని బడ్జెట్ స్పష్టం చేసింది.

### తయారీ రంగానికి ఊతం

ఔషధాలు, సెమీకండక్టర్లు, అరుదైన ఖనిజాలు, రసాయనాలు, క్యాపిటల్ గూడ్స్, జౌళి, క్రీడా సామగ్రి వంటి రంగాల్లో దేశీయ ఉత్పత్తిని పెంచేందుకు కేంద్రం ప్రత్యేక కార్యాచరణను ప్రకటించింది. ఎలక్ట్రానిక్స్ తయారీలో భారత్ సాధిస్తున్న పురోగతిని దృష్టిలో ఉంచుకొని ఈ రంగానికి కేటాయింపులను రెట్టింపు చేస్తూ రూ.40 వేల కోట్లను వెచ్చించనున్నట్లు తెలిపింది. ఐఫోన్ వంటి హైఎండ్ ఉత్పత్తులు దేశంలో తయారవుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం కీలకంగా మారనుంది.

### రవాణా, మౌలిక వసతులకు పెద్దపీట

రైల్వే రంగానికి ఈసారి కేటాయింపులు గణనీయంగా పెరిగాయి. దేశవ్యాప్తంగా హైస్పీడ్ రైల్వే కారిడార్ల నిర్మాణానికి కేంద్రం సంకల్పం ప్రకటించింది. సరుకు రవాణా సామర్థ్యాన్ని పెంచేలా ప్రత్యేక కారిడార్లను అభివృద్ధి చేయనున్నారు. అలాగే 'వీబీజీ రామ్ జీ' పథకానికి దాదాపు రూ.95 వేల కోట్లను కేటాయిస్తూ వ్యవసాయ అనుబంధ రంగాలకు ఊతమిచ్చారు. డేటా సెంటర్ సేవల రంగంలో విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు దీర్ఘకాలిక పన్ను రాయితీలు కూడా ప్రకటించారు.

### భద్రత, సామాజిక రంగాలపై దృష్టి

దేశ రక్షణ వ్యవస్థ ఆధునికీకరణకు ప్రాధాన్యమిస్తూ రక్షణ రంగానికి కేటాయింపులను ఈసారి 15 శాతం మేర పెంచారు. మహిళల అభివృద్ధి కోసం స్టెమ్ విద్యలో మౌలిక సదుపాయాలు, స్వయం సహాయక సంఘాల బలోపేతానికి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. బయోఫార్మా రంగంలో భారత్‌ను అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టేందుకు రాబోయే ఐదేళ్లలో భారీ పెట్టుబడులు పెట్టనున్నారు. క్యాన్సర్ ఔషధాలపై దిగుమతి సుంకాల తొలగింపు రోగులకు ఊరటనిచ్చే నిర్ణయంగా మారింది. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న రాష్ట్రాలు ఉన్నప్పటికీ, ఈ బడ్జెట్‌లో ప్రజాప్రియ హామీలకు కేంద్రం

(మిగతా 2వ పేజీలో)

## తెలంగాణకు హైస్పీడ్ రైళ్లు..

**లోక్‌సభలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్**



తెలంగాణకు 3 హైస్పీడ్ కారిడార్లను కేంద్రం ప్రకటించింది. దేశంలో కొత్తగా 7 నగరాల మధ్య హైస్పీడ్ రైల్ కారిడార్లు ప్రకటించగా పుణె- హైదరాబాద్, హైదరాబాద్-బెంగళూరు,

(మిగతా 2వ పేజీలో)



## కేంద్ర బడ్జెట్‌పై విపక్షాల ఫైర్.. వాస్తవాలను విస్మరించారన్న రాహుల్

- నిరుద్యోగం, రైతుల కష్టాలను ప్రభుత్వం విస్మరించిందని రాహుల్ ఆరోపణ
- స్టాక్ మార్కెట్ పతనానికి బడ్జెట్టే కారణమన్న అఖిలేశ్ యాదవ్
- ఇది కేవలం 5 శాతం మంది ప్రజల కోసమేనని విమర్శ
- మధ్యతరగతి, రైతులు, కార్మికులకు తీవ్ర నిరాశే మిగిలిందని వ్యాఖ్య

## ఎక్సైజ్ సిబ్బంది భద్రతకు ప్రభుత్వం కఠిన నిర్ణయాలు



- మాదకద్రవ్యాల ముఠాలపై ఉక్కుపాదం మోపుతాం : మంత్రి జూపల్లి హెచ్చరిక
- గాంధీ ఆస్పత్రి మార్చురీలో కానిస్టేబుల్ సౌమ్యకు ప్రభుత్వ నివాళులు
- కుటుంబానికి కోటి రూపాయల పరిహారం, ఉద్యోగ భరోసా, పూర్తి వేతనం

## సిట్ విచారణలో మాజీ సీఎం కేసీఆర్

- నాలుగున్నర గంటలపాటు కేసీఆర్ వాంగ్మూలం
- నందినగర్ నివాసంలోనే విచారణ ప్రక్రియ
- ఆరుగురు సీనియర్ అధికారులతో ప్రశ్నల వర్షం
- ట్యాపింగ్ ఆరోపణలపై కీలక అంశాలపై దృష్టి
- విచారణ అనంతరం ఎర్రవల్లికి కేసీఆర్ ప్రయాణం
- భవిష్యత్ దర్యాప్తుపై సిట్‌లో చర్చలు



హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఆదివారం కీలక అడుగు వేసింది. ఈ కేసులో భాగంగా బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావును సిట్ అధికారులు నందినగర్‌లోని ఆయన నివాసంలో ప్రశ్నించారు. మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభమైన విచారణ సుమారు నాలుగున్నర గంటలపాటు కొనసాగింది. ఈ సందర్భంగా కేసుతో సంబంధం ఉన్న పలు కీలక అంశాలపై కేసీఆర్ నుంచి వివరాలు సేకరించినట్లు తెలిసింది. ఈ విచారణ కోసం మొత్తం 15 మంది సభ్యులతో కూడిన సిట్ బృందం కేసీఆర్ నివాసానికి చేరుకుంది. ఇంటి రెండో అంతస్తులోని ప్రత్యేక గదిలో నగర సంయుక్త పోలీస్ కమిషనర్

(మిగతా 2వ పేజీలో)



## కేంద్రానికి తెలంగాణ కనిపించలేదా?

- బడ్జెట్‌లో హైదరాబాద్‌కు ఎందుకు నిర్లక్ష్యం
- రాష్ట్రానికి కేటాయింపులు లేకపోవడం తీవ్ర అన్యాయం
- అన్ని రంగాల్లో తెలంగాణను పక్కన పెట్టారు
- రాజకీయాలకతీతంగా ఎంపీలు పోరాడాలి
- కేసీఆర్ విచారణ చట్టప్రకారమే : భట్టి స్పష్టం
- ప్రభుత్వానికి కక్ష సాధింపు ఉద్దేశం లేదని వెల్లడి

హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్‌పై డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బడ్జెట్ రూపకల్పన సమయంలో కేంద్రానికి తెలంగాణ గుర్తుకురాలేదా అంటూ ప్రశ్నించారు. అంతర్జాతీయంగా పోటీపడే స్థాయిలో మౌలిక వసతులు, మానవ వనరులు కలిగిన హైదరాబాద్‌ను పూర్తిగా విస్మరించడం వెనుక కారణం ఏమిటని నిలదీశారు. ఆదివారం ప్రజాభవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణకు గణనీయమైన కేటాయింపులు ఉంటాయని ఆశించామని, కానీ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ తీవ్ర నిరాశకు గురి చేసిందని అన్నారు.

(మిగతా 2వ పేజీలో)

# భవిష్యత్ వృద్ధే లక్ష్యంగా..



దూరంగా నిలిచింది. మూలధన వ్యయానికి మునుపెన్నడూ లేనంతగా రూ.12.22 లక్షల కోట్లను కేటాయిస్తూ భవిష్యత్ వృద్ధికి పునాది వేసింది. వృద్ధి వేగం, సామాజిక సమగ్రత, ఆర్థిక స్థిరత్వం అనే మూడు స్తంభాలపై ఈ బడ్జెట్‌ను నిర్మించినట్లు కేంద్రం స్పష్టం చేసింది. దీర్ఘకాలిక అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఆర్థిక దిశకు ఇది స్పష్టమైన సంకేతంగా నిలుస్తోంది.

**ఎంఎస్‌ఎంఈకి రూ.10వేల కోట్ల ఫండ్**

దేశంలో ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్న సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు(ఎంఎస్ ఎంఈ) ఛాంపియన్లుగా ఎదగడానికి సహకరించాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా రూ.10,000 కోట్లతో డెడికేటెడ్ ఫండ్‌ను తాజా బడ్జెట్‌లో ప్రకటించింది. నూతన ఉపాధి అవకాశాలను సృష్టించడం, ఉత్పాదకత పెంచడం, వృద్ధిని వేగవంతం చేయడమే లక్ష్యంగా మోదీ ప్రభుత్వం సమగ్ర ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టినట్లు ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. మన కర్తవ్యం నెరవేర్చుకో వడానికి సంస్కరణల ఎక్స్‌ప్రెస్ వేగం ఇలాగే కొనసాగుతుందని స్పష్టంచేశారు. మనకు మూ డు కర్తవ్యాలు ఉన్నట్లు చెప్పారు. అవి.. వేగవంతమైన, సుస్థిరాభివృద్ధి, ఆకాంక్షలు నెరవేర్చు కోవడంసామర్థ్యాలు పెంచుకోవడం, సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్ అని వివరించారు. ఇందులో భాగంగా ఎంఎస్ఎస్‌ఈలు ఛాంపియ న్లుగా మారాలన్నది ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. గ్రోత్ ఇంజన్ కు ఎంఎస్ఎంఈలు అత్యంత కీలకమని ఉద్ఘాటించారు. ఆయా కంపెనీలకు సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. అందుకోసం రూ.10,000 కోట్లతో ప్రత్యేక నిధిని ప్రతిపాదించారు. పొరుగు దేశాలైన చైనా, పాకిస్తాన్ ల నుంచి ఎదురవుతున్న సవాళ్ల దృష్ట్యా మిలటరీ ఆధునీకరణపై కేంద్రం ఫోకస్ పెంచింది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి గాను బడ్జెట్‌లో రక్షణ రంగానికి సింహ భాగం కేటాయించింది. ముఖ్యంగా మూలధన వ్యయంలో భారీ పెరుగుదల చోటు చేసుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఏకంగా లక్ష కోట్లకు పైగానే కేటాయింపులు జరిపింది. 202526లో రూ.6.81 లక్షల కోట్లు కేటాయించగా, ఈసారి రికార్డు స్థాయిలో రూ.7,84,678 కోట్లు ప్రకటించింది. ప్రస్తుత ఏడాదితో పోల్చుకుంటే దాదాపు 15 శాతం అధికంగా కేటాయింపులు జరిపింది. పాకిస్తాన్ పై 'ఆపరేషన్ సింధూర్' నేపథ్యంలో అత్యాధునిక యుద్ధరీతులపై కేంద్రం దృష్టి పెట్టింది. కొత్త ఆ యుధాలు, ఎయిర్‌క్రాఫ్ట్‌లు, యుద్ధనౌకలు, మిలటరీ హార్డ్‌వేర్ కొనుగోళ్లు లక్ష్యంగా మొత్తం రక్షణ బడ్జెట్‌లో మూలధన వ్యయం కోసం రూ.2,19,306 కోట్లు కేటాయించింది.

**వికసిత్ భారత్‌కు రోడ్‌మ్యాప్: ప్రధాని మోదీ**

ఆదివారం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ వికసిత్ బారత్‌కు రోడ్‌మ్యా ప్ అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నా రు. "ఇదొక విశిష్టమైన, ప్రతిష్టాత్మకమైన బడ్జెట్. ఉజ్వలమైన భవిష్యత్తుకు బాటలు వేసే బడ్జెట్. ప్రపంచ వేదికపై మనదేశ ప్రతిష్ట మరింత పెరగడం ఖాయం. అద్భుత అవకాశాలకు ఈ బడ్జెట్ ఒక రహదారి. వికసిత్ భారత్2047కు బలమైన పునాదిగా నిలుస్తుంది. దేశం ప్రయాణిస్తున్న సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌కు నూతన వేగం, నూతన శక్తి లభించడం తథ్యం. మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమాలను బలోపేతం చేయడానికి రోడ్‌మ్యాప్‌గా తోడ్పడుతుంది. దేశ ప్రస్తుత, భవిష్యత్తు అవసరాలను కచ్చితంగా తీరుస్తుంది. మన పరిశ్రమలు లోకల్ నుంచి గ్లోబల్ స్థాయికి ఎదగడానికి ప్రభుత్వం సహకరిస్తుంది" అని ప్రధాని మోదీ అన్నారు. ఆదివారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 202627 సంవత్సరానికి గాను బడ్జెట్‌ను లోక్‌సభలో ప్రవేశపెట్టారు. నిర్మలా సీతారామన్ వరుసగా తొమ్మిదిసార్లు కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తొలి మహిళా ఆర్థిక మంత్రిగా రికార్డు సృష్టించారు.

# సిట్ విచారణలో మాజీ సీఎం కేసీఆర్



ఎస్.ఎం. విజయ్‌కుమార్ నేతృత్వంలో ప్రశ్నలు సాగాయి. కేసు దర్యాప్తు అధికారి జూబ్లీహిల్స్ ఏసీపీ పి. వెంకటగిరితో పాటు ఐపీఎస్ అధికారి నారాయణరెడ్డి, నాన్ కేడర్ ఎస్పీ ఎం. రవీందర్‌రెడ్డి, అదనపు ఎస్పీ కేఎస్ రావు, ఏసీపీ సీహెచ్ శ్రీధర్ విచారణలో పాల్గొన్నారు.

**ఆధారాలతో కూడిన విచారణ**

సిట్ అధికారులు విచారణకు సంబంధించి ఇప్పటివరకు సేకరించిన పత్రాలు, డిజిటల్ పరికరాలు, నిందితులుసాక్షుల వాంగ్మూలాల వివరాలతో కూడిన ఫైళ్లను తమ వెంట తీసుకువచ్చారు. ఈ డాక్యుమెంట్లన్నింటినీ రెండు ట్రంక్ పెట్టెల్లో ఉంచి విచారణకు వినియోగించారు. ప్రశ్నోత్తరాలు ముగిసిన అనంతరం అవన్నీ తిరిగి సిట్ బృందం తమతో తీసుకెళ్లింది. విచారణ అనంతరం అధికారులు బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌కు చేరుకొని సిట్ చీఫ్, నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్‌తో సమావేశమయ్యారు. కేసీఆర్ వాంగ్మూలం, విచారణలో వచ్చిన అంశాలు, తదుపరి కార్యాచరణపై అక్కడ విస్తృతంగా చర్చించినట్లు సమాచారం.

**ప్రశ్నావళి సిద్ధం చేసిన సిట్**

గత వారం రోజులుగా సిట్ కేసీఆర్‌కు రెండుసార్లు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. మొదటి నోటీసుకు స్పందిస్తూ ఆయన విచారణకు కొంత గడువు కోరడంతో పాటు ఎర్రవల్లిలో విచారణ జరపాలని అభ్యర్థించారు. దీనిని సిట్ తిరస్కరించి నందినగర్‌లో హాజరుకావాలని స్పష్టం చేసింది. శనివారం కేసీఆర్ నందినగర్‌లో విచారణకు సిద్ధమని ప్రకటించడంతో సిట్ అధికారులు తక్షణమే ప్రశ్నావళిని సిద్ధం చేశారు. ఈ అనూహ్య పరిణామంతో శనివారం రాత్రి అంతా సిట్ బృందం ప్రశ్నల రూపకల్పనలో నిమగ్నమైందని సమాచారం. విచారణలో ప్రభాకర్‌రావు, రాధాకిషన్‌రావు నియామకాలు, పదవీ విరమణ అనంతరం ఇచ్చిన పొడిగింపులు వంటి అంశాలపై ప్రధానంగా ప్రశ్నించారు. అదేవిధంగా అప్పట్లో కొందరు అధికారులు ప్రగతి భవన్‌కు తరచూ వెళ్లిన అంశం, ఫోన్ ట్యాపింగ్‌కు ఎంపిక చేసిన నంబర్లు, బీఆర్ఎస్ నేతలు మరియు వ్యాపారవేత్తల ఫోన్లపై నిఘా, పార్టీకి వచ్చిన ఎలక్టోరల్ బాండ్ల అంశం వంటి విషయాలపై వివరాలు అడిగినట్లు తెలిసింది.

**భద్రత, గోప్యత కట్టుదిట్టం**

విచారణ సమయంలో భద్రతను పోలీసులు కట్టుదిట్టం చేశారు. నందినగర్ పరిసర ప్రాంతాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. విచారణ జరుగుతున్న గదిలోకి ఎవరికీ అనుమతి ఇవ్వలేదు. న్యాయవాదుల హాజరుకూ అవకాశం లేదని స్పష్టం చేశారు. కేసీఆర్ ఒక్కరినే ఉంచి ప్రశ్నలు సంధించారు. మొత్తం విచారణ ప్రక్రియను వీడియో రికార్డింగ్ చేయడంతో పాటు కేసీఆర్ వాంగ్మూలాన్ని అధికారికంగా నమోదు చేశారు. విచారణ పూర్తైన అనంతరం రాత్రి 10 గంటల ప్రాంతంలో కేసీఆర్ నందినగర్ నివాసం నుంచి ఎర్రవల్లికి బయలుదేరారు. ఆయన కాన్వాయ్‌కు పోలీసులు బందోబస్తు కల్పించారు. సిట్ విచారణతో ఫోన్ ట్యాపింగ్ కేసు మరో కీలక దశకు చేరినట్లు రాజకీయ, న్యాయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

## కేంద్ర బడ్జెట్‌పై విపక్షాల ఫైర్.. వాస్తవాలను విస్మరించారన్న రాహుల్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 బడ్జెట్‌పై విపక్షాలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డాయి. దేశం ఎదుర్కొంటున్న వాస్తవ ఆర్థిక, సామాజిక సవాళ్లను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. నిరుద్యోగం, తయారీ రంగం క్షీణత, రైతుల కష్టాలు వంటి కీలక సమస్యలను పరిష్కరించడంలో ఈ బడ్జెట్ ఘోరంగా విఫలమైందని ఆయన ఆదివారం విమర్శించారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా రాహుల్ గాంధీ స్పందించారు. "ఉద్యోగాలు లేని యువత, పడిపోతున్న తయారీ రంగం, దేశం నుంచి తరలిపోతున్న పెట్టుబడులు, కుప్పకూలుతున్న కుటుంబ పొదుపు, రైతుల కష్టాలు, పొంచివున్న ప్రపంచ ఆర్థిక సంక్షోభాలు... వీటన్నింటినీ బడ్జెట్ పట్టించుకోలేదు. దిద్దుబాటు చర్యలకు నిరాకరిస్తున్న ఈ బడ్జెట్, భారతదేశ వాస్తవ సంక్షోభాల పట్ల గుడ్డిగా వ్యవహరిస్తోంది" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. రాహుల్‌తో పాటు ఇతర విపక్ష నేతలు కూడా బడ్జెట్‌పై పెదవివిరిచారు. వృద్ధిని పునరుద్ధరించడానికి, ఉపాధి కల్పించడానికి ఇందులో సరైన సంస్కరణలు లేవని విమర్శించారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ మరో అడుగు ముందుకేసి, స్టాక్ మార్కెట్ పతనానికి బడ్జెట్టే కారణమని ఆరోపించారు. "బీజేపీ బడ్జెట్ ఫలితం ఇదిగో.. షేర్ మార్కెట్ భారీగా కుప్పకూలింది. ఆదివారం మార్కెట్ తెరుస్తారా లేదా అన్నది ప్రశ్న కాదు, అది ఇంకా ఎంత పడిపోతుందన్నదే అసలు ప్రశ్న అని మేము ముందే చెప్పాం" అని ఆయన అన్నారు. ఈ బడ్జెట్ కేవలం 5 శాతం మంది ప్రజల కోసమేనని, కమీషన్లు దక్కించుకోవడానికి, బీజేపీ సొంత వ్యక్తులకు ప్రయోజనం చేకూర్చడానికే దీన్ని రూపొందించారని ఆయన తీవ్రంగా ఆరోపించారు. "ఇది బీజేపీ తరహా అవినీతికి కంటికి కనిపించని లెక్కల చిట్టా" అని అఖిలేష్ అభివర్ణించారు. అనియంత్రితంగా పెరుగుతున్న ద్రవ్యోల్బణం సమయంలో పన్ను ఉపశమనం కల్పించకపోవడం 'పన్ను దోపిడీ' కిందకే వస్తుందని ఆయన విమర్శించారు. సంపన్నులకు వ్యాపారం, ప్రయాణాల కోసం పదుల రకాల మినహాయింపులు ఇచ్చి, నిరుద్యోగులకు మాత్రం 'ఆశల ఖాళీ పళ్లెం' చూపించారని ఎద్దేవా చేశారు. ఈ బడ్జెట్ వల్ల మధ్యతరగతి ప్రజలు పూర్తిగా మోసపోయినట్లు భావిస్తున్నారని, పేదలు మరింతగా కుంగిపోతున్నారని అన్నారు. రైతులు, కార్మికులు, చిరు వ్యాపారులు టెలిస్కోప్‌తో వెతికినా తమ కోసం ఇందులో ఏమీ కనిపించలేదని, ఇది తీవ్ర నిరాశాజనకమైన, దారుణమైన బడ్జెట్ అని అఖిలేష్ యాదవ్ వ్యాఖ్యానించారు. బడ్జెట్‌పై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఇది విజన్, మిషన్, దిశానిర్దేశం లేని బడ్జెట్ అని, పూర్తిగా అబద్ధాలతో నిండి ఉందని ఆమె అభివర్ణించారు.

## కేంద్రానికి తెలంగాణ కనిపించలేదా?

నిలుస్తోంది. కోవిడ్ సమయంలో ప్రధాని స్వయంగా ప్రశంసించిన భారత్ బయోటెక్ సంస్థ ఇక్కడే ఉంది. అయినప్పటికీ బయోఫార్మా రంగ కేటాయింపుల్లో తెలంగాణకు చోటు లేకపోవడం ఆశ్చర్యకరం. ఎలక్ట్రానిక్స్ రంగానికి వేల కోట్ల రూపాయలు ప్రకటించి, ఈసీఐఎల్ వంటి ప్రముఖ సంస్థలున్న హైదరాబాద్‌కు ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం నిరుత్సాహపరిచింది' అని విమర్శించారు.

**హైదరాబాద్‌ను పక్కన పెట్టిన కేంద్రం**

హైదరాబాద్ అంటే ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అంటే హైదరాబాద్ అనే పేరును కేంద్రం చెరిపేయాలని చూస్తోందని భట్టి ఆరోపించారు. భవిష్యత్ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన ఆరెంజ్ ఎకానమీఆడియో, వీడియో, గేమింగ్, కామిక్స్ రంగాల్లో హైదరాబాద్‌కు ప్రపంచ స్థాయి సామర్థ్యం ఉన్నప్పటికీ, కేంద్రం ఉద్దేశపూర్వకంగా ఆ అవకాశాలను ముంబైకి తరలించిందన్నారు. మెడికల్ టూరిజంలో దేశానికే ఆదర్శంగా నిలిచిన తెలంగాణను విస్మరించి, ఇతర రాష్ట్రాల్లో రీజినల్ మెడికల్ హబ్‌లు ఏర్పాటు చేయడం ఏ న్యాయసూత్రం ప్రకారమని ప్రశ్నించారు. అన్ని రంగాల్లోనూ హైదరాబాద్‌ను పక్కన పెట్టి బడ్జెట్ ప్రతిపాదనలు రూపొందించారని విమర్శించారు.

**నిధులపై ఆశలు వృథా**

హైదరాబాద్ నగరాభివృద్ధికి అత్యంత కీలకమైన మూసీ పునరుజ్జీవం, రీజినల్ రింగ్ రోడ్, మెట్రో రైలు విస్తరణ వంటి ప్రాజెక్టులకు భారీ నిధులు కేటాయిస్తారని భావించామని, కానీ ఒక్క పథకానికీ కేటాయింపులు లేకపోవడం తీవ్ర నిరాశ కలిగించిందని భట్టి చెప్పారు. సెమీకండక్టర్ పరిశ్రమ ఏర్పాటు అంశంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీపరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ప్రధాని వద్దకు వెళ్లినా ఫలితం లేకుండా పోయిందన్నారు. రామప్ప ఆలయం, మన్ననూరు, కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లు వంటి పర్యాటక ప్రాధాన్యం ఉన్న ప్రాంతాలను పర్యాటక ప్యాకేజీలో చేర్చకపోవడం కూడా అన్యాయమన్నారు. ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరచడం ద్వారా గ్రామీణ పేదల జీవనాధారాన్ని దెబ్బతీస్తున్నారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమంపై బడ్జెట్ మౌనం పాటించడం సామాజిక న్యాయానికి విరుద్ధమని పేర్కొన్నారు. కేంద్రానికి ఒక విధానం, రాష్ట్రానికి మరో విధానమా అంటూ భట్టి ప్రశ్నించారు. తెలంగాణ నుంచి ఎన్నికైన ఎంపీలు పార్టీ భేదాలు పక్కనబెట్టి, రాష్ట్రానికి న్యాయం జరిగేలా కేంద్రంపై ఒత్తిడి తెచ్చాలని కోరారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను సిట్ విచారించడంపై భట్టి స్పందించారు. కేసీఆర్‌పై ప్రభుత్వానికి ఎలాంటి వ్యక్తిగత ద్వేషం లేదని, విచారణ పూర్తిగా అధికారికంగా, చట్ట పరిధిలోనే జరుగుతోందని స్పష్టం చేశారు. పారదర్శక పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. దేశ భద్రత, ఉగ్రవాద నియంత్రణ కోసం వినియోగించాల్సిన ఫోన్ ట్యాపింగ్‌ను వ్యక్తుల వ్యక్తిగత జీవితాలపై వాడటం సరికాదని వ్యాఖ్యానించారు. విచారణ ఎవరి ఇష్టానుసారం జరగదని, నిబంధనల ప్రకారమే కొనసాగుతుందని భట్టి వెల్లడించారు.



## ఎక్సైజ్ సిబ్బంది భద్రతకు ప్రభుత్వం కఠిన నిర్ణయాలు

**మాదకద్రవ్యాల ముఠాలపై ఉక్కుపాదం మోపుతాం : మంత్రి జూపల్లి**

**గాంధీ ఆస్పత్రి మార్చురీలో కానిస్టేబుల్ సౌమ్యకు ప్రభుత్వ నివాళులు**


**కుటుంబానికి కోటి రూపాయల పరిహారం, ఉద్యోగ భరోసా, పూర్తి వేతనం**

హైదరాబాద్: ఎక్సైజ్ శాఖ సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం చూపే శక్తులకు ఎలాంటి ఉపశమనం ఉండదని, శాఖ ఉద్యోగుల జోలికి వస్తే చట్టం తన పూర్తి బలాన్ని చూపుతుందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. విధి నిర్వహణలో అసాధారణ ధైర్యాన్ని ప్రదర్శించి ప్రాణాలు కోల్పోయిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్యకు ఆదివారం సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి మార్చురీలో ఆయన ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ, మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు పాల్పడుతున్న ముఠాలపై ఇకపై మరింత కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్సైజ్ శాఖ ఉద్యోగుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తామని, అవసరమైతే ఎక్సైజ్ పోలీసులకు ఆయుధాలు అందించే అంశాన్ని కూడా ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తోందని తెలిపారు. ఈ విషయంపై త్వరలో స్పష్టమైన, సమతుల్యమైన నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. సౌమ్య భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆమె చూపిన వృత్తి నిబద్ధత, సాహసం, బాధ్యతా భావం చరిత్రలో నిలిచిపోతాయని మంత్రి అన్నారు. ఆమె త్యాగం ఎక్సైజ్ శాఖతో పాటు మొత్తం పోలీసు వ్యవస్థకు స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. సౌమ్య కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం తరఫున సౌమ్య కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం అందిస్తామని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని మంత్రి జూపల్లి ప్రకటించారు. అంతేకాకుండా, సౌమ్య పదవీ విరమణ వయస్సు వరకు ఆమెకు రావాల్సిన పూర్తి వేతనాన్ని ప్రభుత్వం చెల్లిస్తుందని స్పష్టం చేశారు. ఈ నిర్ణయం బాధిత కుటుంబానికి కొంత భరోసా ఇస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇదిలా ఉండగా, తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ ఉద్యోగులు తమ ఒక రోజు వేతనాన్ని సౌమ్య కుటుంబానికి విరాళంగా ఇవ్వాలని నిర్ణయించారు. గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం ఆమె పార్థివ దేహాన్ని ప్రత్యేక అంబులెన్స్‌లో స్వగ్రామానికి తరలించారు. నిజామాబాద్ జిల్లా మోస్రా మండల కేంద్రంలో సౌమ్య అంత్యక్రియలు అధికారిక లాంఛనాలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డ్రగ్ కంట్రోల్ డీజీ షానవాజ్ ఖాసీం, ఎక్సైజ్ శాఖ అదనపు కమిషనర్ యాసిన్ ఖురేషీ, పలువురు డిప్యూటీ కమిషనర్లు, సూపరింటెండెంట్లు, ఉద్యోగ సంఘ నాయకులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మంత్రి జూపల్లి అంత్యక్రియలకు హాజరై చివరి నివాళులు అర్పించారు. కాగా, ఈ ఘటనపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో సౌమ్య ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని పేర్కొంటూ, ఈ ఘటనకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సౌమ్య కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని సీఎం భరోసా ఇచ్చారు.

## తెలంగాణకు హైస్పీడ్ రైళ్లు..

హైదరాబాద్ : హైదరాబాద్-చెన్నై కారిడార్లు తెలంగాణ మీదుగా వెళ్లనున్నాయి. వీటితో పాటు ముంబయి-పుణె, ఢిల్లీ- వారణాసి, వారణాసి-సిలిగుడి, చెన్నై-బెంగళూరు మధ్య కూడా కొత్త కారిడార్ల నిర్మాణం చేపట్టనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం లోక్‌సభలో ప్రకటించారు. వీటికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు రూ.12.2 లక్షల కోట్లు కేటాయిస్తున్నట్లు మంత్రి తెలిపారు. గత సంవత్సరం రూ.11.2 లక్షల కోట్లు కేటాయించగా ఈసారి స్వల్పంగా పెంచారు. వీటి ద్వారా ప్రధాన ఆర్థిక, సాంస్కృతిక కేంద్రాల మధ్య అనుసంధానం పెరుగుతుందని అన్నారు. సుదూర ప్రయాణాల విషయంలో పర్యావరణ హితమైన రవాణా వ్యవస్థగా ఈ కారిడార్లు మారుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇవి ప్రయాణ సమయాన్ని కుదిస్తాయని, రహదారి మార్గం, ఇప్పటికే ఉన్న రైలు నెట్‌వర్క్‌లో రద్దీని తగ్గిస్తాయని పేర్కొన్నారు.

## కేసీఆర్‌కు నోటీసులు... 'సిట్'కు కొత్త అర్థం చెప్పిన హరీశ్ రావు



ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)పై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇది 'సిట్' కాదని, 'సీఎం ఇన్‌స్ట్రక్షన్ టీమ్' అని ఆయన కొత్త అర్థం చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశాల నుంచి ఫోన్‌లో ఏది చెబితే, పోలీసులు ఇక్కడ అదే పాటిస్తున్నారని ఆరోపించారు. సిట్ స్వతంత్రంగా పనిచేయడం లేదని, సీఎం కార్యాలయం నుంచి వచ్చే ఆదేశాల ప్రకారమే నడుచుకుంటోందని, "సిట్ అంటే సిట్, స్టాండ్ అంటే స్టాండ్" అన్నట్లుగా వారి వైఖరి ఉందని ఎద్దేవా చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడం రాజకీయ కక్షసాధింపు చర్యల్లో పరాకాష్ఠ అని హరీశ్ రావు అభివర్ణించారు. ఈ నోటీసుల వెనుక చట్టం లేదని, కేవలం సీఎం రేవంత్ రెడ్డి అహంకారం, రాజకీయ ప్రతీకారం మాత్రమే ఉన్నాయని ధ్వజమెత్తారు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన నేతకు కనీస మర్యాద ఇవ్వకుండా, ఆయన నివాసం ఎక్కడ ఉందో రాష్ట్రమంతటికీ తెలిసినా, నందినగర్‌లోని ఇంటి గోడకు నోటీసులు అంటించడం కాంగ్రెస్ ప్రభుత్వ చౌకబారు రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు. పాలన చేతకాక, ఇచ్చిన హామీలు నెరవేర్చలేక, ప్రజా సమస్యలకు సమాధానం చెప్పలేక ప్రభుత్వంపై పెరుగుతున్న వ్యతిరేకతను పక్కదారి పట్టించేందుకే ఈ సిట్ డ్రామా ఆడుతున్నారని హరీశ్ రావు ఆరోపించారు. వరుస కుంభకోణాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు, మున్సిపల్ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే ఈ చిల్లర రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. చరిత్రను సృష్టించిన వ్యక్తి కేసీఆర్ అయితే, ఆ చరిత్రను మలినం చేయాలని చూస్తున్న చరిత్రహీనుడు రేవంత్ రెడ్డి అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం ఇచ్చిన నోటీసులు చట్టబద్ధం కానప్పటికీ, అనుసరించిన విధానం రాజ్యాంగ విరుద్ధమైనప్పటికీ.. కేసీఆర్ ఒక బాధ్యతాయుతమైన ప్రతిపక్ష నేతగా, భారత పౌరుడిగా దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తున్నారని హరీశ్ రావు స్పష్టం చేశారు. అయినప్పటికీ పోలీసులు అతిగా ప్రవర్తిస్తున్నారని, గజ్వేల్ నుంచి హైదరాబాద్ వరకు వేలాది మందిని మోహరించి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను అక్రమంగా అరెస్టులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ వారిని ఇబ్బందులకు గురిచేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. రైతుల కష్టాలు, యువత ఉద్యోగాలు, పింఛన్ల పెంపు వంటి అంశాలను గాలికొదిలి, ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వం పనిగా పెట్టుకుందని విమర్శించారు.

# విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నతంగా ఎదగాలి





- ఎంజేపీటీ లు విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తాయి
- ఘనంగా మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాల వార్షికోత్సవం...
- మహాత్మ జ్యోతిబాపూలే గురుకులాలు విద్యార్థుల భవిష్యత్తుకు సోపానాలు...
- విద్యార్థుల భవిష్యత్తుకు మొదటి మెట్టు పాఠశాల...
- విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని అత్యున్నత శిఖరాలను చేరుకోవాలి...
- ఎంజేపీటీ పాఠశాల, కళాశాల సంచిక విడుదల
- ఆర్సిఓ గౌతమ్ కుమార్ రెడ్డి,ఏజీవోలు వెంకట్రావు, వెంకటేశ్వర్ రెడ్డి
- తూప్రాన్ పేట సర్పంచ్ బక్కతట్ల రాధిక శ్రీశైలం

ఎంజేపీటీ పాఠశాల,కళాశాల ప్రిన్సిపల్ బుసిరెడ్డి శిరీష

**చౌటుప్పల్.ఫిబ్రవరి 01. ప్రభాత సూర్య :** మహాత్మ జ్యోతిబాపూలే గురుకులాలు విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తాయని, విద్యార్థుల భవిష్యత్తుకు పాఠశాలలోనే పునాది పడుతుందని మహాత్మ జ్యోతిబాపూలే హైదరాబాద్ ఆర్సిఓ గౌతమ్ కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం చౌటుప్పల్ మండలం, తూప్రాన్ పేట గ్రామ పరిధిలోని ఎంజేపీటీ ముషీరాబాద్ అండ్ చార్మినార్ పాఠశాల,కళాశాల 2026 వార్షికోత్సవ కార్యక్రమాలు ప్రిన్సిపల్ బుసిరెడ్డి శిరీష ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తూప్రాంపేట గ్రామ సర్పంచ్ బక్కతట్ల రాధిక శ్రీశైలం దంపతులు, హైదరాబాద్ ఆర్సిఓ గౌతమ్ కుమార్ రెడ్డి,ఏ జీవో లు వెంకట్రావు, వెంకటేశ్వర్ రెడ్డి, జిహెచ్ఎం రిటైర్డ్ ఆఫీసర్ సిహెచ్ రవీంద్ర చారి పాల్గొని పాఠశాల ప్రిన్సిపాల్ బి.శిరీష తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని వారి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థుల భవిష్యత్తుకు మొదటి మెట్టు పాఠశాలని,గురుకుల పాఠశాలలో చదువుకున్న ఎంతో మంది పూర్వ విద్యార్థులు నేడు గొప్ప ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారని విద్యార్థులకు తెలియజేశారు. తల్లిదండ్రులకు, చదువుకున్న పాఠశాలకు, విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు మంచి పేరు తెచ్చి పెట్టే విధంగా నడవడిక ఉండాలన్నారు. ఏ రంగంలో చూసిన గురుకుల విద్యార్థులే అధిక సంఖ్యలో ఉన్నత స్థాయిలో ఉన్నారని గుర్తు చేశారు. విద్యార్థి దశ నుండే





క్రమశిక్షణతో మెలిగి ఉన్నత శిఖరాలకు చేరుకొని దేశానికి సేవ చేయాలని ఉద్బోధించారు. ఎక్కడ పోటీ ఉంటుందో అక్కడ పోరాడే పఠిమను విద్యార్థులు అలవర్చుకోవాలన్నారు. పాఠశాల వార్షికోత్సవం లో భాగంగా హైదరాబాద్ ఆర్సిఓ గౌతమ్ కుమార్ రెడ్డి విద్యార్థులను మేల్కొల్పే పాట పాడి ఉత్సాహపరిచారు. ప్రిన్సిపల్ బి శిరీష ఆధ్వర్యంలో అనంతరం పాఠశాల,కళాశాల మ్యాగజైన్ ను విశిష్ట అతిథుల చేతుల విడుదల చేశారు. మ్యాగజైన్లోని వ్యాసాలు, ఛాయాచిత్రాలను చూసి విచ్చేసిన అతిథులు ప్రిన్సిపల్ బి.శిరీషను ప్రత్యేకంగా అభినందించారు.

**విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు:బక్కతట్ల రాధిక శ్రీశైలం**

విద్యార్థులు కష్టపడి చదివితే భవిష్యత్తులో ఉన్నత స్థానాల్లో నిలుస్తారని తూప్రాన్ పేట గ్రామ సర్పంచ్ బక్కతట్ల రాధిక శ్రీశైలం తెలిపారు. శనివారం గ్రామ పరిధిలోని ఎం జె పి టి పాఠశాల,కళాశాలలో జరిగిన వార్షికోత్సవ కార్యక్రమానికి వారు విశిష్ట అతిథిగా పాల్గొని మాట్లాడుతూ... పాఠశాల వార్షికోత్సవం అంటే విద్యార్థుల ప్రతిభను, పాఠశాల విజయాలను ప్రదర్శించే ఒక అద్భుతమైన వేదిక అని తెలిపారు. విద్యార్థులు చదువుని ఇష్టంగా ఎంచుకొని ముందుకు సాగాలని తెలిపారు. గురుకుల విద్యార్థులు క్రమశిక్షణకు మారుపేరుగా నిలుస్తున్నారని తెలిపారు. గురుకులంలో చదువుకున్న విద్యార్థులు దేశ విదేశాల్లో ఉన్నత స్థానంలో ఉన్నారని విద్యార్థులకు గుర్తు చేశారు. రానున్న పది, ఇంటర్ వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాలకు తన వంతు సహాయ సహకా రాలు అందిస్తానన్నారు. సంస్కృతిక కార్యక్రమా లను ప్రదర్శించిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు చదువు, క్రీడలు ఇతర రంగాలలో సాధించిన ప్రతిభకు వారి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ప్రిన్సిపాల్ శిరీషను, ఉపాధ్యాయులను అభినందించారు.

**విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని అత్యున్నత శిఖరాలు చేరుకోవాలి: ప్రిన్సిపల్ బి.శిరీష**

శనివారం మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాల కళాశాలలో జరిగిన పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.శిరీష పాల్గొని మాట్లాడుతూ... విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని అత్యున్నత శిఖరాలను చేరుకోవాలని తెలిపారు. పది,ఇంటర్ విద్యార్థులు రానున్న వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యలో రాణించి మన మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాల పేరు ప్రఖ్యాతలను రాష్ట్ర, అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింప జేయాలని విద్యార్థులకు తెలిపారు. ఇదే సంస్థ పాఠశాలలో విద్య నభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకున్న పూర్వ విద్యార్థులను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు .వార్షికోత్సవ కార్యక్రమానికి వచ్చిన విశిష్ట అతిథులను ప్రిన్సిపల్ బి.శిరీష, పాఠశాల,కళాశాల ఉపాధ్యాయులు మెమొంటోళ్లు అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. 2006 సంవత్సరంలో పాఠశాలలో నిర్వహించిన పలు క్రీడా పోటీలు,సాంస్కృతిక కార్యక్రమాలలో గెలుపొందిన విద్యార్థులకు ఆహ్వానితుల చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు ఆహుతులను, సభికులను విశేషంగా కట్టుకున్నాయి. పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి తోడ్పాటు అందించిన ఉపాధ్యాయులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమంలో తూప్రాన్ పేట గ్రామ సర్పంచ్ బక్కతట్ల రాధిక శ్రీశైలం, హైదరాబాద్ ఆర్సిఓ గౌతమ్ కుమార్ రెడ్డి,ఏ జీవోలు వెంకట్రావు, వెంకటేశ్వర్ రెడ్డి, జిహెచ్ఎం రిటైర్డ్ ఆఫీసర్ సిహెచ్ రవీంద్ర చారి, పాఠశాల,కళాశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు,పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా పాతగుట్ట

# లక్ష్మీనరసింహుల కళ్యాణం



**యాదగిరిగుట్ట,ఫిబ్రవరి 01(ప్రభాత సూర్య):** కళ్యాణ వేదిక విద్యుత్ కాంతులు విరజిమ్ముతుండగా..భక్తుల జయజయ ధ్వానాలు.. గోవింద నామస్మరణలు.. మంగళ వాయిద్యాలు.. మిన్నంటగా యాదగిరిగుట్ట అనుబంధ ఆలయం పాతగుట్టలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రకరకాల పూలమాలతో అలంకృతి గావించగా గజవాహనంపై స్వామివారు, ముత్యాల పల్లకిలో అమ్మవారిని ఊరేగింపుగా వేదికకు చేర్చారు. వివిధ పుష్ప మాలికలు, వజ్ర వైఢూర్యాలతో అలంకృతుడైన శ్రీ స్వామివారిని పెళ్ళి కుమారు డుగా, అమ్మవారిని పెళ్ళి కుమార్తెగా ముగ్ధమనోహరంగా ఆలయ పూజారులు ముస్తాబు చేయగా అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు శ్రీనారసింహుడు లక్ష్మీదేవిని పరిణయమాడి లక్ష్మీ నరసింహుడుగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు తమ బాగ్యోత్సవాలుగా భావించి కమనీయంగా రమణీయంగా పారాయణికులు, రుత్వికులు, పండితుల వేద మంత్రాలు, ఆస్థాన విధ్వాంసుల మంగళ వాయిద్యాలు నడుమ కన్నుల పండుగగా బ్రహ్మోత్సవ వేడుక సాగింది. మొదట విశ్వ క్సేన పూజ నిర్వహించి కళ్యాణ మహోత్సవానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా స్వామి అమ్మ వార్లకు ఆలయ ఈవో జే. భవానిశంకర్, అనువంశిక ధర్మకర్త భాస్కరాయణీ నరసింహ మూర్తి పట్టువస్త్రాలను సమర్పించారు. మంగళ వాయిద్యాలతో స్వామివారి కళ్యాణ తంతును ప్రారంభిం చారు. పిదప బ్రహ్మాది దేవతలు హాజరై ఆశీర్వదించి పాంచరాత్రాఆగమశాస్త్ర రీత్యా యాజ్ఞికులు, అర్చకులు జీలకర్ర బెల్లం కార్యక్రమాన్ని నిర్వహించారు. లక్ష్మీ దేవి తండ్రి సముద్రుడు కాళ్ళు కడిగి కన్యాదానం చేయగా 10:02 గంటలకు భక్తుల జేజే ద్వానాలు మిన్నంటగా స్వామివారు అమ్మవారికి సూత్రాధారణ గావించారు. స్వామివారి కల్యాణ వేడుకకు విచ్చేశారు. ఈ సందర్భంగా కవచమూర్తు లను దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. ఈ వేడుకల్లో ప్రధానార్చకులు కాండూరి వెంకటాచార్యులు, బట్టలు సురేంద్రాచార్యులు, ఉప ప్రధానార్చకుడు కొడకండ్ల మాధవాచార్యులు, డీఈవో దోర్భల భాస్కర్ శర్మ, ఏఈవోలు నాగుల మహేష్ గౌడ్, కలెక్టర్ హనుమంతరావు, సాదునేని మధుకర్, స్థానికులు పాల్గొన్నారు.

## జి హెచ్ ఎం సి కార్పొరేటర్ గా బరిలో బలరామ్ యాదవ్..

ఎమ్మెల్యే గాంధీ కి అనుచరణ గణంతో వెళ్లి అవకాశం ఇవ్వాలని బలరామ్ యాదవ్ విజ్ఞప్తి..



**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :** రాబోయే జి హెచ్ ఎం సి ఎన్నికల్లో గెలుపు గుర్రాల కే ఎన్నికల్లో పోటీచేసే అవకాశం ఉంటుందని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, రాష్ట్ర పి ఎ సి ఛైర్మెన్ అరేకపుడి గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం లోని శ్రీ రామ్ నగర్ ఏ బ్లాక్ సంక్షేమ సంఘం అధ్యక్షులు బలరాం యాదవ్ 200మంది అనుచరులతో కలిసి ఎమ్మెల్యే గాంధీ నీ కలిసి తనకు రాబోయే జి హెచ్ ఎం సి ఎన్నికల్లో శ్రీ రామ్ నగర్ కార్పొరేటర్ గా పోటీచేసే అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీచేసే అవకాశం కాంగ్రెస్ అధిష్టానం చూస్తుందని తాను కేవలం ప్రతిపాదనలు చేసి పంపడం వరకే తన పాత్ర ఉంటుందని అన్నారు. నిరంతరం ప్రజల్లో ఉంటూ ప్రజలకు సేవచేసే వారికి పార్టీ తప్పకుండ అవకాశం ఇస్తుందని అన్నారు. ఈ సారి ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల సంఖ్య పెరుగుతుందని అన్నారు. ప్రజల్లో పేరు ఉండి గెలిచే అభ్యర్థులకు మాత్రమే పోటీచేసే అవకాశం ఉటుందని వివరించారు. నిరంతరం ప్రజల్లో ఉంటూ వారికీ అందుబాటు లో ఉన్నవారే గెలిచే ఎక్కువ అవకాశం ఉంటుందని అన్నారు. నేను ఇస్తామని చెప్పిన అధిష్టానం ఒప్పుకోదని వారుకూడా శాస్త్రీయంగా వారి సర్వేలో ఎవరూ విజయం సాధిస్తారో వారికే అవకాశం కల్పిస్తుందని వివరించారు. పని చేయండి ప్రజలకు అందుబాటుల్లో ఉంటూ వారి కష్టసుఖాల్లో భాగస్వాములై ప్రజా సేవకు అంకితం కావాలని బలరాం యాదవ్ కు సూచించారు. జి హెచ్ ఎం సి లో డివిజన్లు పెరిగే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఎన్నికలు మరో 6 నెలల సమయం ఉందని తెలిపారు. పార్టీ అన్ని విషయాలు పరిగణలోకి తీసుకోని గెలుపు గుర్రాలకే జి హెచ్ ఎం సి ఎన్నికల్లో పోటీచేసే అవకాశం కల్పిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బలరాం యాదవ్ అనుచరులు సుమారు 200 మంది అభిమానులతో శ్రీరామ్ నగర్ బ్లాక్ నుంచి భారీ కన్వాయ్ తో ఎమ్మెల్యే స్వగృహానికి తరలివెల్లారు. దారిపోడవున బలరాం యాదవ్ కు అనుకూలంగా నినాదాలు చేస్తూ అనునాయులు ఎమ్మెల్యే గాంధీ ని కలసి బలరాం యాదవ్ కు కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ గా అవకాశం కల్పించేలా సిఫారసు చేసే భాధ్యత మీరు తీసుకోవాలి గెలిపించుకుని తీసుకు వచ్చే బాధ్యత మాది అని తెలియజేశారు.

## దివ్య ఎంటర్ ప్రైజెస్, ఎం ఆర్ కె హోమ్ ఇంటీ రియర్స్ ప్రారంభోత్సవం..

ప్రారంభించిన సీనియర్ నాయకులు మువ్వ సత్యనారాయణ, ప్రసాద్స్ ఫౌండేషన్ చైర్మన్ లయన్ డి ఎస్ ఆర్ కె ప్రసాద్..



**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :** మదినగూడలో ప్రసాద్స్ ఫౌండేషన్ సభ్యులు ఎం ఆర్ కే చౌదరి నూతన వ్యాపార సంస్థ దివ్య ఎంటర్ ప్రైజెస్, ఎం ఆర్ కె హోమ్ ఇంటీ రియర్స్ ను రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మువ్వ సత్యనారాయణ చేతులమీదుగా ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్స్ ఫౌండేషన్ చైర్మన్ లయన్ డి ఎస్ ఆర్ కె ప్రసాద్ పాల్గొని ఎం.ఆర్.కే చౌదరి కి శుభాకాంక్షలు తెలియజేస్తూ అభివృద్ధిలోకి సంస్థ ఎదిగి ఆర్థిక పరంగా పరిపుష్టం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యు. సాంబశివ రావు, వెంకట్రావ్, రావలా శ్రీనివాస్ చౌదరి, శ్రీకాంత్ చౌదరి, పెద్ద బాబు చౌదరి, భాస్కర్, ప్రసన్న, దివ్య, ఎం. జనిత్ చౌదరి, మోక్షిత, సన్మిత తదితరులు పాల్గొన్నారు.

## కుట్రలు కుతంత్రాలతో కేసీఆర్ చరిత్ర ను చేరపలేరు.. బి ఆర్ ఎస్ పార్టీ శ్రేణులు..



శేరిలింగంపల్లి ప్రభాత సూర్య : తెలంగాణ తొలి ముఖ్యమంత్రివర్యులు కేసీఆర్ కి సిట్ నోటీసుల పేరుతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గపు, అరాచక చర్యలకు వ్యతిరేకంగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని మక్త మహబూబ్ పేట్ లో భారీ నిరసన కార్యక్రమం చేపట్టిన బీఆర్ఎస్ శ్రేణులు కుట్రలు, కుతంత్రాలతో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కేసీఆర్ ను అప్రదిష్ట పాలు చేసే కార్యక్రమాలను ప్రజలు గమనిస్తున్నారు అని వాటిని తిప్పికొట్టడానికి బి ఆర్ ఎస్ పార్టీ శ్రేణులు సన్నద్ధం అయ్యాయి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తౌట్ రెడ్డి సంతోష్ రెడ్డి, బిఎస్ఎన్ కిరణ్ యాదవ్, రోజా, గోపరాజు శ్రీనివాసరావు, వాలా హరీష్, పార్నంది శ్రీకాంత్, నర్సింగరావు, సురేష్ గౌడ్, రాజు ముదిరాజ్ ఇతర నాయకులు పాల్గొన్నారు.



## శతాబ్ది భవనంలో టీఆర్ఆర్ఎస్ అధ్వర్యంలో శ్రీ మడేలేశ్వర స్వామికి పూజలు చేసిన టీఆర్ఆర్ఎస్ నాయకులు

### తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి

**నల్లకుంట,ఫిబ్రవరి 01(ప్రభాత సూర్య):** హైదరాబాద్ నల్లకుంట శతాబ్ది భవనంలో ఆదివారం తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక, రాష్ట్ర అధికార ప్రతినిధి ముత్యాల నర్సింగరావు,రాష్ట్ర కోశాధికారి ఓరుగంటి వెంకటయ్య, రాష్ట్ర యూత్ ప్రధాన కార్యదర్శి బేగంపేట నర్సిములు, మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పొలాస సాయి కుమార్, జిల్లా సంయుక్త కార్యదర్శి చౌలపల్లి ఆనంద్ , నెల్లుట్ల వెంకన్న హాజరై రజక కులదైవం ఐన శ్రీశ్రీశ్రీ మడివాల మాచిదేవుని చిత్రపటానికి పూలమాల వేసి జయంతి వేడుకలు జరుపుకున్నారు. దేశంలోని ప్రతి రజక కులస్తుల ఇంట్లో దేవుని గదిలో శ్రీ మడివాల మాచిదేవుని ఫోటో పెట్టి పూజించాలని గోపి రజక కులస్తులను కోరారు. రజక కులస్తులపై ఆ భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడు ఉండాలని ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో, విద్యాబుద్ధులు ప్రసాదించేలా దీవించాలని పొలాస సాయి కుమార్ దేవుడిని వేడుకున్నారు.

## మిర్యాలగూడ పురపాలక ఎన్నికలలో కాంగ్రెస్కు మద్దతు తెలిపిన సిపిఐ



**మిర్యాలగూడ, ఫిబ్రవరి 1:- (ప్రభాత సూర్య):** మిర్యాలగూడ మున్సిపాలిటీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థులకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. సిపిఐ మిర్యాలగూడ మండల కార్యదర్శి అంజనపల్లి రామలింగం అధ్యక్షతన ఆదివారం జరిగిన నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. 48 వార్డుల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల గెలుపుకు కృషి చేస్తామన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్కు మద్దతు ఇస్తున్నందుకు కో ఆప్షన్ సభ్యులు ఇచ్చేందుకు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అంగీకరించారన్నారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పొదిల శ్రీనివాస్. వేములపల్లి, దామరచర్ల మండల కార్యదర్శిలు జిల్లా యాదగిరి. పోలేపల్లి ఉదయ్ కుమార్. మహిళా సమాఖ్య నాయకులు ఎరబోతు పద్మ, ఎస్కే షమీం, లింగంపల్లి సైదమ్మ. కోటయ్య. గజ్జల లక్ష్మీనరసింహారెడ్డి. బిక్షం. నాగయ్య. లక్ష్మయ్య. రాములు. యశ్వంత్ పాల్గొన్నారు

## పలుగుతండాలో 25 కెవిఏ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు



త్రిపురారం ప్రతినిధి: వోల్టేజి సమస్యలను నివారించడానికి తెలంగాణ విద్యుత్తుశాఖ వారు ప్రతీ గ్రామంలో కొత్త ట్రాన్స్ఫార్మర్ లను ఏర్పాటు చేయడం, కొత్త విద్యుత్తు స్థంభాలు వేసి లైన్లు లాగడం లాంటివి చేస్తున్నారు. అందులో భాగంగానే నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం పలుగుతండా గ్రామంలో లోవోల్టేజి సమస్యను నివారించడానికి నూతనంగా త్రిపురారం మండల విద్యుత్తు సహాయక ఇంజనీరు బాలు నాయక్ ఆధ్వర్యంలో 25 కెవిఏ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయడం జరిగింది. తద్వారా ఎన్నో రోజులుగా ఉన్న విద్యుత్తు ఇబ్బందులు ఈరోజుతో తొలిగిపోయాయి. ఇట్టి కార్యక్రమంలో పలుగుతండాకు గ్రామపంచాయతీ సర్పంచ్ రమేష్ నాయక్, లైన్ మెన్ మోతీలాల్ నాయక్, పలుగుతండా గ్రామపంచాయతీకి చెందిన మూడు శంకర్ నాయక్, ముని నాయక్, గ్రామపంచాయతీ సిబ్బంది నాగు నాయక్, చత్రు నాయక్, ఆర్.బికన్, ఆర్. హునా, గ్రామపంచాయతీ వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ పార్టీలు పద్మశాలిలకు ప్రతినిధ్యం కల్పించాలి

### లేదంటే స్వతంత్రులుగా తమ శక్తి ఏమిటో చాటుతామని ప్రకటించిన రాజేంద్రనగర్ జేఏసీ.

### జేఏసీ ఆధ్వర్యంలో మార్కండేయనగర్ లో జరిగిన రాజకీయ చైతన్య సభకు అనూహ్యస్పందన.

### ముఖా ముఖి సమావేశం - సామూహిక భోజనాలతో సందడి చేసిన పద్మశాలిలు.





**గండిపేట్: సూర్య ప్రతినిధి:** ఉమ్మడి మైలార్ దేవ్ పల్లి డివిజన్ లో పద్మశాలీల సంఘటిత శక్తిని చూసి రాజకీయ పార్టీలు పిలిచి టికెట్ ఇవ్వాల్సిందేనని రాజేంద్రనగర్ పద్మశాలి జేఏసీ స్పష్టం చేసింది. జన బలం మాది, గెలిపించే ఓట్ల సంఖ్య మాదే అయినప్పుడు పద్మశాలి నాయకత్వాన్ని గెలిపించుకోవాల్సిన బాధ్యత తమదేనని తీర్మాణించారు. గ్రేటర్ హైదరాబాద్ లో వార్డులు విలీనం, పునర్విభజనలో భాగంగా మైలార్ దేవ్ పల్లి డివిజన్ రెండుగా ఏర్పడుతున్న నేపథ్యంలో రాజేంద్రనగర్ సర్కిల్ పద్మశాలి జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం మార్కండేయనగర్ లో 'రాజకీయ చైతన్యం - పోటీకి పద్మశాలి సంసిద్ధత' పై విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ ప్రతినిధుల బృందం అందరి అభిప్రాయాలు సభా ముఖంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ రాజకీయంగా పద్మశాలిలలో మరింత చైతన్యం తీసుకురావడానికి శాయశక్తులా కృషి చేస్తామన్నారు. మెజారిటీ ప్రజలుగా, ఓటర్లుగా ఉన్న తమ సామాజిక వర్గం నుంచి రానున్న ఎన్నికల్లో పోటీ చేసే వారికి తమ సంపూర్ణమద్దతు ప్రకటించారు. అందుకోసం త్వరలో కోర్ కమిటీని ఏర్పాటు చేయడంతో పాటు బస్తీల వారిగా సభలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రధానంగా వివిధ రాజకీయ పార్టీలలో నాయకులుగా కొనసాగుతున్న వారికి ఆయా పార్టీలు స్వతహాగా టికెట్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో స్వతంత్రులుగా పద్మశాలి శక్తి ఏమిటో చూపక తప్పదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మార్కండేయనగర్ పద్మశాలి సంఘం ప్రతినిధులు గద్దె క్రిష్ణ, ఏర్వ సత్యనారాయణ, కోట జగదీష్, మునగపాటి విష్ణు, పగిడిమర్రి సూర్యనారాయణ, విడెం రమేష్, గద్దె యాదగిరి, కోట శ్యామ్ కుమార్ తోపాటు జేఏసీ నాయకులు మునగపాటి వెంకటేష్, సంకూరి జయప్రకాష్, మసున వెంకటేష్, పులిజాల వివేకానంద, బొల్ల శ్రీనివాస్, గంజి వెంకటేష్, కాశిగారి యాదగిరి, కొక్కుల దత్తు, కొంపల్లి జగదీష్, బొల్ల నరేందర్, ఉస్కెమూరి శ్రీనివాస్, కైరంకొండ శంకర్, బొల్ల వెంకటేష్, యంజాల మహేష్ రాజ్, బిర్రు రాధాక్రిష్ణ, గంజి లాలీశ్వర్,మ్యాకం ఈశ్వర్, సిరిసాల నారాయణ, వర్కల చందు, కోట పవన్ కుమార్, దొంతరాజు, కాశిగారి వెంకటేష్, శిరం దాస్ నరేందర్, పల్లాటి నర్సింహా, పిసికే భాస్కర్, సంకూరి శ్రీకాంత్, గంజి రాజు, రావుల నవీన్, గుత్తి మల్లేష్, శిరం దాస్ ప్రభాకర్, సిద్రాల రాజు, గంజి నరేష్, బాస క్రిష్ణ, గంజి తిరుపతయ్య, యాదగిరి భాస్కర్, కర్నాటి శ్రీనివాస్, మూశం నరేష్, గంజి ధనంజయ్, కెంచె వెంకటేష్, జి. వినోద్, భరత్ తో పాటు మహిళ ప్రతినిధులు గంజి పద్మమ్మ, పగిడిమర్రి ఉమాదేవి, కైరంకొండ లలిత, బోనకుర్తి కళావతి, గంజి ధనలక్ష్మీ, గుర్రం నివేధిత, గుర్రం సుగుణ, దువ్వ మంగమ్మ, మసున కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

### మందుమూల మల్లన్న జాతరలో

## పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్

**ఘన స్వాగతం పలికిన ఆలయ కమిటీ సభ్యులు.. ఆలయంలో ప్రత్యేక పూజలు**



**రామచంద్రాపురం ఫిబ్రవరి 1 ప్రభాత సూర్య:** రామచంద్రపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాస నగర్ కాలనీలో గల మందుమూల శ్రీశ్రీశ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన కళ్యాణ మహోత్సవం, జాతర ఉత్సవంలో పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు ఎమ్మెల్యే జిఎంఆర్ కు మేల తాళాలతో, డప్పు వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు జాతరలు ప్రతీకలని అన్నారు. మల్లన్న స్వామి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే జి.ఎం.ఆర్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పుష్ప నగేష్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, సీనియర్ నాయకులు పరమేష్ యాదవ్, ఐలేష్ యాదవ్, కురుమ సంఘం ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.






## బిఆర్ఎస్వి ఆధ్వర్యంలో నల్ల జెండాలతో నిరసన

### బీఆర్ఎస్ వి రాష్ట్ర కార్యదర్శి కట్ట శ్రీను

**ప్రభాత సూర్య నల్గొండ :** నల్గొండ జిల్లా నార్కట్ పల్లి మండలం ఆదివారం ఎంజీ యూనివర్సిటీ ఎదురుగా బిఆర్ఎస్వి అధ్వర్యంలో నల్ల జెండాలతో నిరసన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధకుడు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ని సిట్ విచారణకు పిలవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని బిఆర్ఎస్వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టా శ్రీనివాస్ తీవ్రంగా ఖండించారు.తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి పెట్టిన నాయకుడిని రాజకీయ కక్షతో విచారణ పేరుతో వేధించడం తగదని ఆయన అన్నారు.ప్రజల ఆకాంక్షలు, ఉద్యమాల త్యాగాలతో సాధించిన తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపించిన కేసీఆర్ ప్రతిష్ఠను దెబ్బతీయాలనే ఉద్దేశంతోనే ఈ సిట్ విచారణ చేపట్టారని విమర్శించారు. ఇది పూర్తిగా రాజకీయ ప్రతీకార చర్యగా ఆయన అభివర్ణించారు.ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం బిఆర్ఎస్ పార్టీ శ్రేణుల పోరాటాలు ఇలానే కొనసాగుతాయని తెలిపారు. కేసీఆర్ పై జరుగుతున్న అన్యాయాన్ని ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో తగిన సమాధానం ఇస్తారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నాగర్జున, గాధే శివ, మైనం యుగందర్,ఉపేందర్, కంధుల సంపత్,అలి, సుధీర్ పాల్గొన్నారు.

## మిర్యాలగూడ ఎఫ్ సి ఐ వద్ద నిలిచిన గూడ్స్ ట్రైన్ రెండు గంటలు ట్రాఫిక్కు అంతరాయం

**మిర్యాలగూడ, ఫిబ్రవరి 1:-( ప్రభాత సూర్య):** సాంకేతిక కారణంగా గూడ్స్ ట్రైన్ రెండు గంటల పాటు నిలిచిపోవడంతో కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిపై కిలోమీటర్ల మేర వాహనాలు, ఆర్టీసీ బస్సులు ఎక్కడికక్కడే నిలిచిపోయిన సంఘటన ఆదివారం పట్టణంలోని ఎఫ్సీఐ రైల్వే లెవెల్ క్రాసింగ్ వద్ద చోటుచేసుకుంది. గూడ్స్ రైలు ఎఫ్సీఐ రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద మిర్యాలగూడ పట్టణం వైపు కిలోమీటర్, నాగార్జునసాగర్ రహదారి వైపు కిలోమీటర్ మేర నిలిచిపోవడంతో రాకపోకలు పూర్తిగా స్థంభించాయి. దీంతో నాగార్జుసాగర్, దేవరకొండ, జడ్చర్ల వెళ్లే వాహనదారులు, ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న రైల్వే అధికారులు, సాంకేతిక సిబ్బంది అక్కడికి చేరుకొని సాంకేతిక లోపాన్ని సరి చేసి గూడ్స్ రైలును వెనకకు పంపినట్లు సిబ్బంది తెలిపారు.

## మండల పరిధిలో అక్రమ కట్టడాలు

**మర్రిగూడ ఫిబ్రవరి 1 ప్రభాత సూర్య :** మర్రిగూడ మండలంలోని దామర భీమనపల్లి శివారులో గల సర్వే నెంబర్ 581 లో ఏలాంటి అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా కోళ్ల ఫారం షెడ్డు నిర్మాణం దీని పై గతంలోనే గ్రామస్తులు ఎంపీడీవో గారికి మరియు దామెర భీమనపల్లి గ్రామ సెక్రటరీ గారికి గ్రామస్తులు దరఖాస్తు ఇచ్చిన్నప్పటికి కూడా ప్రభుత్వ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు ఇప్పటికే అక్రమంగా నిర్మించిన ఒక కోళ్ల షెడ్డుతో దుర్వాసన దోమలు ,ఈగల బెడదతో సతమాతమవుతున్నారు ఇప్పటికైనా అధికారులు పట్టించుకోని అక్రమంగా నిర్మిస్తున్న నిర్వహిస్తున్న కోళ్ల ఫారం షెడ్డుని అపేయవలసిందిగా, లేని యెడల ఇండ్లు కాలి చేసి వెళ్ళవలసిన పరిస్థితి ఏర్పడుతుందని గ్రామ ప్రజలు వాపోతున్నారు ఇప్పటికైనా అధికారులు స్పందించి నిర్మాణం నిలిపివేయాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు



# కేసీఆర్ కు సిట్ నోటీసులు విచారణకు వ్యతిరేకంగా బిఆర్ఎస్ ర్యాలీ, ధర్నా





### మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలి

### కాంగ్రెస్ నిరంకుశ పాలనకు చరమగీతం పాడాలి

### మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు

**మిర్యాలగూడ ఫిబ్రవరి 1:-( ప్రభాత సూర్య) :** మాజీ సిఎం బీఆర్ఎస్ అధ్యక్షుడుకేసీఆర్ కి సిట్ నోటీసుల పేరుతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గపు, అరాచక చర్యలను నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆగ్రహ జ్వాలలు వెల్లువెత్తాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణం ఆర్టీసీ బస్టాండ్ వద్ద మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. అబద్ధాల పునాదులపై గద్దెనెక్కిన కాంగ్రెస్‌కు హామీలను అమలు చేయడం చేతకాక ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్, కేసీఆర్ పై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. ఆధారాలు లేని ఫోన్ ట్యాపింగ్ అనే లొట్టపీసు కేసులో రాజకీయ కక్షతోనే విచారణ పేరిట డ్రామాలు ఆడుతున్నదని ధ్వజమెత్తారు. రేవంత్ సర్కార్ రాజకీయ దురుద్దేశంతోనే ఫోన్ ట్యాపింగ్ కేసును తెరపైకి తెచ్చిందని విమర్శించారు. బీఆర్ఎస్ ను రాజకీయంగా ఎదుర్కొనే సత్తా లేక బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కుట్రలకు పాల్పడుతున్నాయన్నారు. కేసీఆర్ లక్ష్యంగా సిట్ అధికారుల తీరు కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందన్నారు. రాష్ట్రాన్ని సుభిక్షంగా పాలించిన మహానేత కేసీఆర్ పై సీఎం రేవంత్ రెడ్డి కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. విచారణకు అంగీకరిస్తానని చెప్పినా కూడా కేసీఆర్ ఇంటి గేటుపై అర్ధరాత్రి సిట్ అధికారులు నోటీసును అంటించడం రేవంత్ సర్కార్ కుట్రలో భాగమేనన్నారు. రేవంత్ సర్కార్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఫోన్ ట్యాపింగ్ కేసు ను తెరపైకి తెచ్చి బీఆర్ఎస్ పై రేవంత్ సర్కార్ రాజకీయ కుట్ర పన్నిందన్నారు. రేవంత్ తీరును, అనుసరిస్తున్న విధానాలను యావత్ తెలంగాణ సమాజం గమనిస్తోందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటు వేసి ఓటుతోనే రేవంత్ సర్కార్ కు బుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్ నిరంకుశ పాలనకు చరమగీతం పాడాలని ఆకాంక్షించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థులను బంపర్ మెజారిటీతో గెలిపించాలని పట్టణ ప్రజలను భాస్కర్ రావు కోరారు. బీఆర్ఎస్ శ్రేణులు మిర్యాలగూడ పట్టణంలో రెడ్డికాలనీ బీఆర్ఎస్ కార్యాలయం నుంచి నల్లకండువాలు, నల్ల బ్యాడ్జీలు ధరించి ప్లకార్డులు చేబూని బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు చేబూని రేవంత్ సర్కార్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో టీఎస్ ఆగ్రోస్ మాజీ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, రైతు బంధు సమితి మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నల్లమోతు సిద్దార్థ, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టిబాబునాయక్, పెద్ది శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి షోయబ్, నాయకులు, కౌన్సిలర్ అభ్యర్థులు, మహిళా నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంబటి రాంబాబు చంద్రబాబు నాయుడుకిబహిరంగంగా క్షమాపణచెప్పాలి

### మర్రిగూడ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు దోమల వెంకటయ్య యాదవ్



మర్రిగూడ వైసీపీ మాజీ మంత్రి అంబటి రాంబాబు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారిని ఉద్దేశించి ఉపయోగించిన, భాష అత్యంత హేయమైనది, హంకారమైనదని తె.దే.పా ,దోమల వెంకటయ్య యాదవ్ విమర్శించారు. ఆదివారం మర్రిగూడ మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అసహనం దిగజారుడుతనంతో అంబటి రాంబాబు వాడిన పదజాలం సభ్య సమాజం చీదరించుకునే రీతిలో ఉందన్నారు. ప్రతిపక్ష నాయకులు బాధ్యతతో ప్రజాస్వామ్య రీతిలో వ్యవహరించాలి కానీ ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తిని అసభ్య పదజాలంతో బూతులు తిడితే ప్రజలు ప్రజాస్వామ్య వాదులు చూస్తూ ఊరుకోరన్నారు. అంబటి రాంబాబు తన తప్పు తెలుసుకొని చంద్రబాబు నాయుడు గారికి ప్రజల ముందు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. చెప్పని ఎడల అంబటి రాంబాబును ఆంధ్రలో గాని తెలంగాణలో గాని ఎక్కడ కూడా తిరుగనివబోమని మర్రిగూడ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దోమల వెంకన్న ఒక ప్రకటనలు తెలిపారు. అదేవిధంగా మర్రిగూడ మండల తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు పోలే మల్లయ్య మాట్లాడుతూ, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా అసభ్య పదజాలంతో మాట్లాడడం చట్టరీత్య నేరం, సమాజంలో ఇలాంటి ధోరణి నీ అరికట్టాలంటే ఇలాంటి వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తిరుమల కల్తీ నెయ్యి విషయాన్ని సైడ్ ట్రాక్ చేయాలనే ఉద్దేశంతో వైసీపీ నాయకుడు జగన్ ఆడిస్తున్న గేమ్లో భాగంగానే అంబటి రాంబాబు రాష్ట్ర ముఖ్యమంత్రి పై బూతు పురం తో రెచ్చిపోయాడని అన్నారు. జగన్కు ప్రజాస్వామ్యంపై విలువ ఉంటే తక్షణమే అంబటి రాంబాబును పార్టీ నుండి సస్పెండ్ చేయాలని సూచించారు.

## కేంద్ర బడ్జెట్ పూర్తిగా ప్రజా వ్యతిరేకమైంది

### బడ్జెట్ కార్పొరేట్ కంపెనీలకు వరాలు, పెదలపై భారాలు

### సిపిఐ(యం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు



**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి ఫిబ్రవరి 01:** ఆదివారం పార్లమెంటులో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ 9వ సారి ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ పూర్తిగా ప్రజా వ్యతిరేకమైందని సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు అన్నారు.నేడు ఒక ప్రకటన విడుదల చేసి మాట్లాడుతూ నేడు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ 9వ సారి ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ పూర్తిగా ప్రజా వ్యతిరేకమైందని అన్నారు. ఇది కార్పొరేట్ కంపెనీలకు వరాలు, పెదలపై వేసేదిగా ఉన్నదని విమర్శించారు.మొత్తం బడ్జెట్ 53,47,315కోట్ల లో 28,16,922 కోట్లు మాత్రమే ఆదాయం ఉన్నదని, 16,95,768 కోట్లు అప్పులు ఉన్నాయన్నారు. వీటిని పేద మధ్య తరగతి పై భారలు వేస్తారని అన్నారు.రాష్ట్రానికి, జిల్లాకు నిధులు కేటాయించకుండా మొండి చేయి చూపిందని, కేంద్రం నిధులు కేటాయించేటట్లు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.గొప్పలు చెప్పుకుంటున్న మోడీ ప్రభుత్వం యువత, రైతులను విస్మరించినదని అన్నారు.ఆర్థిక అసమానతలు తగ్గించటానికి బడ్జెట్ లో నిధులు కేటాయింపు లేదన్నారు. ఎస్సీ , ఎస్టి, విద్యా, వైద్యం కు, వ్యవసాయం కు నిధులు పెంచాలని అన్నారు. తయారు రంగాన్ని కూడా పూర్తి గా విస్మరించిన ఈ బడ్జెట్ పూర్తి గా ప్రజా వ్యతిరేకమైనదని అన్నారు.

## నల్గొండ కార్పొరేషన్ 31వ డివిజన్ ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా- మిరియాల జ్యోతి స్వామి



**నల్గొండ ప్రభాత సూర్య :** నల్గొండ పట్టణం శ్రీనగర్ కాలనీ మిరియాల జ్యోతి స్వామి వారి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా 31వ డివిజన్ స్థాయిలో సమస్యలను గుర్తించి, పరిష్కారం దిశగా మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి త్రాగునీటి, మురికి కాలువల శుభ్రత, వీధి దీపాలు ఏర్పాటు మొక్కలను నాటడం, దోమలను నివారించడానికి పాగింగ్ చేపించడం, అంగన్వాడి ప్రీ ప్రైమరీ స్కూల్ ద్వారా విద్యను అందించడం ఆశా కార్యకర్తల ద్వారా గర్భిణీ స్త్రీలకు పిల్లలకు పోషకాహార పదార్థాలు అందించడం, స్వయం సహాయక సంఘాల ద్వారా వడ్డీ లేని రుణాలు అందించడం, యువతి, యువకులకు విద్యా, ఉద్యోగ ఉపాధి కల్పనను ఏర్పాటు చేసే విధంగా, అందరికీ అందుబాటులో ఉంటానని మీ కుటుంబ సభ్యురాలుగా అక్క చెల్లెలుగా ఉంటానని, మీ ఆశీర్వాదంతో, రానున్న కార్పొరేషన్ ఎన్నికలలో 11వ తేదీన అత్యధిక భారీ మెజార్టీతో కారు గుర్తుపై ఓటు వేసి గెలిపించగలరని విజ్ఞప్తి చేశారు.



## వైఎస్ఆర్సీపీ నేత అంబటి వ్యాఖ్యలను ఖండించిన టిడిపి నేతలు

**మిర్యాలగూడ , ఫిబ్రవరి 1:- (ప్రభాత సూర్య):** టిడిపి జాతీయ అధ్యక్షులు. ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై వైసీపీ మాజీ మంత్రి అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలను టిడిపి జాతీయ క్రమశిక్షణ కమిటీ సభ్యులు, నియోజకవర్గ ఇన్చార్జి బంటు వెంకటేశ్వర్లు తీవ్రంగా ఖండించారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ వై ఎస్ఆర్సీపీ నేత అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలు సభ్య సమాజానికి తలవంపులు తెచ్చే విధంగా ఉన్నాయన్నారు. వైసిపికి ప్రజలు బుద్ధి చెప్పిన మార్పు లేదన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావతమైతే ఊరుకోబోమని హెచ్చరించారు. సమావేశంలో పట్టణ కన్వీనర్ వడ్డేబోయిన శ్రీనివాస్, నాయకులు నసీరుద్దీన్ బాబా, ఏచూరి అనంతరాములు. గోపాలకృష్ణ నాగేందర్, సత్యనారాయణ, శంకర్రావు, కాంతాచారి, కొండయ్య పాల్గొన్నారు.

## శిల్పారామం లో అలరించినా వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు....



**మాదాపూర్ ప్రభాత సూర్య :** మాదాపూర్ లో నీ శిల్పారామం లో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం యునైటెడ్ స్టేట్స్ నుండి విచ్చేసిన కూచిపూడి కళాకారిణి కుమారి వృందా పూటుకూరి తన కూచిపూడి ప్రదర్శనలో శ్రీ గణపతిం, అలిమేలు మంగ, కొలువై ఉన్నాడే అంశాలను ప్రదర్శించి మెప్పించారు. శ్రీమతి దుర్గేష్ నందిని శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలో జయము జయము, వినాయక కౌతం, సాధించెనే ఓ శారదా భుజంగం, మరకత, అష్టపది, నిర్వాణం శతకం అంశాలను సంయుక్త, అద్వైత, భవజ్ఞ, గీతికా, సాహితి, మహి వర్ణిక, హెష్ణ, ఏష, స్వాతి, అంజనీ, జయ, సాధికా, శాన్వి మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు..

## ఎమ్. డి. ఆర్.ఫౌండేషన్‌కు గద్దర్ అవార్డు గౌరవం



**పటాన్చెరు ఫిబ్రవరి 1 ప్రభాత సూర్య:** మండలం లోని సమాజ సేవే ధ్యేయంగా, నిత్యం ప్రజల కోసం అంకితభావంతో పనిచేస్తున్న,ఎమ్. డి. ఆర్. ఫౌండేషన్ కు గద్దర్ స్ఫూర్తి పురస్కారాలు కార్యక్రమంలో ప్రతిష్టాత్మక అవార్డు అందజేయబడింది.

సామాజిక మార్పు కోసం తన జీవితాన్ని అర్పించిన ప్రజాగాయకుడు గద్దర్ జయంతి సందర్భంగా, హైదరాబాద్ తెలుగు విశ్వవిద్యాలయంలో గద్దర్ స్ఫూర్తితో నిర్వహించిన ఈ కార్యక్రమంలో, ఎమ్. డి. ఆర్. ఫౌండేషన్ సేవలను గుర్తించి ఈ గౌరవం లభించడం జరిగింది.ఈ అవార్డు ప్రధానం కార్యక్రమంలో గద్దర్ కూతురు, తెలంగాణ సాంస్కృతిక సంఘం అధ్యక్షురాలు మరియు చైర్మన్ వెన్నెల, ఎమ్. డి. ఆర్. ఫౌండేషన్ ప్రతినిధులకు అందజేశారు.అనాథల అంత్యక్రియలు, పేదల సహాయం, వైద్య సేవలు, అత్యవసర సహాయ కార్యక్రమాలు వంటి అనేక సేవా కార్యక్రమాలతో సమాజంలో విశేషమైన గుర్తింపు పొందుతున్న, ఎమ్. డి. ఆర్. ఫౌండేషన్‌కు ఇది మరో మైలురాయి.ఇలాంటి పురస్కారాలు మరింత సేవ చేయడానికి ప్రేరణగా నిలుస్తాయి. భవిష్యత్తులో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలతో ప్రజల మధ్య మా జీవితాంతం ముందు ఉండి ప్రజలకు సేవ అందిస్తామని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాం.





## అమిన్ పూర్ లో ముగిసిన సమ్మక్క సారలమ్మ అమ్మ వార్ల జాతర...,

**అమీన్ పూర్ ఫిబ్రవరి 1 ప్రభాత సూర్య:** పఠాన్ చేరు నియోజకవర్గం, అమిన్ పూర్ డివిజన్ లో సమ్మక్క, సారాలమ్మ ఆలయ అధ్యక్షుడు నీలం బిక్షపతి ఆధ్వర్యంలో సమ్మక్క సారలమ్మ జాతర ప్రారంభం. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలందరికీ సమ్మక్క సారలమ్మ అమ్మవారి ఆశీర్వాదాలు, పటాన్ చెరువు నియోజకవర్గం పరిధిలోని అమిన్ పూర్ పట్టణంలో 28.1.26 నుండి మూడు రోజులపాటు మా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సమ్మక్క సారలమ్మ అమ్మ వర్ల జాతరను అంగరంగా వైభవంగా నిర్వహిస్తున్నాము,తెలంగాణ రాష్ట్రంలోని ములుగు జిల్లా, తాడ్వాయి మండలంలో ఉన్న మేడారం అనే అటవీ గ్రామంలో జరుగుతుంది. సమ్మక్క-సారలమ్మ అమ్మవర్ల జాతరను మాగ శుద్ధ పౌర్ణమి రోజున లక్షలాది మంది భక్తుల సమక్షంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు, మేడారం లో మరియు అమిన్ పూర్ పట్టణం లో జాతరను నిర్వహించడం జరుగుతుంది, అంత దూరం వెళ్లని భక్తులు కర్ణాటక, మహారాష్ట్ర, హైదరాబాద్ నలుమూలల గ్రామాల నుండి లక్షలాదిగా భక్తులు విచ్చేసి దర్శించుకుని కోరికలను నెరవేర్చుకుంటారు, ఇక్కడికి వచ్చే భక్తులకు ఎటువంటి అసాకార్యాలు కలగకుండా తల నిలాలు సమర్పించుకోవడానికి స్థలం, మహిళలకు టాయిలెట్ మొబైల్స్ ను అందుబాటులో ఉంచుతామని అన్నారు, పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ పాండురంగ రెడ్డి, వైస్ మున్సిపల్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్, అమీన్పూర్ మున్సిపల్ కమిషనర్ గార్ల సహాయ సహకారాలు ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు నీలం బిక్షపతి ముదిరాజ్, మల్లికార్జున్, ఆలయ కమిటీ సభ్యులు అమీన్ పూర్ మున్సిపల్ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మల్లన్న స్వామి కల్యాణ మహోత్సవం



**తుర్కపల్లి ఫిబ్రవరి 1 ప్రభాత సూర్య:** తుర్కపల్లి మండలం వీరారెడ్డిపల్లి గ్రామంలో ఈరోజు కానుగంటి భాస్కర్ యాదవ్ ఘనంగా మల్లన స్వామి పండగ జరిపించారు. అనంతరం ఆయన సత్యనారాయణ స్వామివారికి అర్చకులచే ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ కరిక్రమానికి హాజరైన పెద్దలు ఉపసర్పంచ్ తాటికొండ నర్సింహులు,వార్డుమెంబర్ ఎయ్యముల కనకరాజు,గుర్రాల కనకరాజు కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు,ఆర్ ఎంపీ హరిబాబు,ఆర్ ఎంపీ సాయి,బీజేపీ నాయకుడు ప్రకాష్ యాదవ్ భానుప్రసాద్,శ్రీనాథ్,చంద్రం,పాల్గొన్నారు

## అన్నపూర్ణేశ్వరి ఆశ్రమంలో వైభవంగా కాశి విశ్వనాథ కళ్యాణశీ


### శ్రీశ్రీశ్రీ శంకరనంద స్వామి ఆధ్వర్యంలో ఘనంగా మహా పడిపూజ

### శివనామంతో మారుమోగిన అన్నపూర్ణేశ్వరి ఆశ్రమం





**సంస్థాన్ నారాయణపురం, ఫిబ్రవరి 01(ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని శ్రీ అన్నపూర్ణేశ్వరి ఆశ్రమం లో శ్రీశ్రీశ్రీ అన్నపూర్ణేశ్వర సమేత కాశి విశ్వనాథ కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా ఆశ్రమం నిర్వాహకులు శ్రీ శంకరానంద స్వామిజి ఆధ్వర్యంలో నిర్వహించటం జరిగింది. అనంతరం మహా పడిపూజ కార్యక్రమాన్ని శివస్వాములతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వేలాది మంది భక్తులు విచ్చేసి మహా పడిపూజ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శివ స్వాములు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ ప్రదాత కెసిఆర్ కు సిట్ నోటీసులు ఇవ్వడం సిగ్గుచేటు

### తన ప్రాణాన్ని పణంగా పెట్టి తెలంగాణ సాధించిన నాయకునికా నోటీసులు

### తెలంగాణలో ప్రజావ్యతిరేక పాలన కొనసాగుతుంది

### నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి



ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి ఫిబ్రవరి 01: మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ ప్రధాత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు సిట్ నోటీసులు ఇవ్వడని నిరసిస్తూ సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రదాత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు సిట్ నోటీసులు ఇవ్వడం దుర్మార్గమైన చర్య అని ఆమె అన్నారు. కేవలం కక్ష సాధింపులో భాగంగా ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పూనుకుంటుందని అన్నారు. కెసిఆర్ తెలంగాణ ప్రజల కోసం కాళేశ్వరం నిర్మించారు, రైతులకు 24 గంటల కరెంటు ఇచ్చారు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, రైతులకు ఉచిత విద్యుత్, వికలాంగుల పెన్షన్, మహిళా పెన్షన్ లాంటి ఎన్నో పథకాలను కెసిఆర్ కొనసాగించారు. అలాగే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేస్తే డిస్కవరీ ఛానల్ లో కేసీఆర్ కోసం ప్రత్యేకమైన కథనం ప్రచారం చేయడం జరిగిందని అన్నారు. దేశమంతా కేసీఆర్ను పొగిడితే తెలంగాణ ప్రభుత్వం మాత్రం కెసిఆర్ కు సిట్ నోటీసులు ఇవ్వడం ఏమిటని ఆమె ప్రశ్నించారు. నిన్నటికి నిన్న ఎకనామిక్ సర్వే ఛానల్లో తెలంగాణలో ధాన్యం ఉత్పత్తి పెరగడం అంటే అది కేసీఆర్ వల్లనే జరిగిందని ప్రచారం చేయడం జరిగిందని ఆమె తెలిపారు. కేవలం కేసీఆర్ పైన పగ తీర్చుకోవడం కోసం కెసిఆర్ ప్రభావం ప్రజల్లో ఇంకా ఉంది కనుకనే ఇలా కక్ష సాధింపు చర్యలకు సీఎం రేవంత్ రెడ్డి కోరుకుంటున్నాడని ఆమె ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుండి ఈ రాష్ట్రంలో కెసిఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానని చెప్పడం ఈరోజు సిట్ నోటీసులు ఇవ్వడం రాజకీయ కక్షలో భాగమేనని అన్నారు. 65 సంవత్సరాలు ఉన్నటువంటి వ్యక్తికి ఇంటికి వెళ్లి విచారణ చేపట్టవలసిన పరిస్థితి ఉన్న సుప్రీంకోర్టు, హైకోర్టు డైరెక్షన్స్ ఉన్నప్పటికీ కూడా కావాలని వారిని ఇబ్బంది పెట్టాలనే ఆలోచనతోని ఎర్రవల్లి వెళ్లకుండా ఇక్కడికే రమ్మని ఆయనను ఇబ్బంది పెట్టే విధంగా చర్యలు తీసుకోవడం సిగ్గుచేటు అని అన్నారు. రాత్రికి రాత్రికి వెళ్లి నంది నగర్ లో ఉన్న కేసీఆర్ ఇంటి గేటుకు నోటీసులు అతికించడం అంటే ఈ రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వం ఎంతకు దిగజారిందో తెలుస్తుందని ఆమె అన్నారు. రాష్ట్రంలో రాజకీయంగా తేల్చుకోలేని కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయంగా బెదిరించి భయపెట్టిస్తే భయపడేవారు ఇక్కడ ఎవరూ లేరని ఆమె హెచ్చరించారు. సిట్ తనకు నోటీసులు స్వయంగా అందించక పోయినా కూడా నేను విచారణకు సహకరిస్తానని కెసిఆర్ తెలపడం ఆయన ఉందా తనానికి నిదర్శనమని ఆమె తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కక్ష సాధింపు చర్యలకు ఇది నిదర్శనమని, రాజకీయ వేధింపులకు గురిచేయా లనే విధానాన్ని ఖండిస్తూ, కెసిఆర్ రాజకీయ జీవితంలో ప్రజల్లో ఒక చెరగని ముద్ర వేసుకున్నారని ఆయనను ఎవ్వరు ఆపలేరు అని కెసిఆర్ గారి నాయకత్వంలో ఎలాంటి పోరాటానికైనా సిద్ధమని ఆమె తెలిపారు.




# ఫిబ్రవరి 12న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి...






### కార్మికులు, రైతులు, కూలీలు దేశమంతట పోరుబాట పట్టాలి.

### మోడీ ప్రభుత్వం తన విదానాలు మార్చుకోవాలి..

### జె మల్లికార్జున్ పిలుపు..

**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి ఫిబ్రవరి 01 :** ఆదివారం సినర్జీ కార్మికుల జనరల్ బాడీ సమావేశం పటాన్చెరువులోని శ్రామిక భవన్లో జరిగింది. ఈ సందర్భంగా సిఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జే మల్లికార్జున్ మాట్లాడుతూ ఫిబ్రవరి 12వ తేదీన దేశ వ్యాప్త సమ్మెలో కార్మికులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, కూలి, ప్రజ, రైతంగ వ్యతిరేక విధానాలను వెంటనేవిరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికులు, రైతులు, కూలీలు దేశమంతటా పోరుబాట పట్టాలని పట్టారని మోడీ ప్రభుత్వం తన ఆర్థిక విదానాలను మార్చుకోవాలని ఆయన అన్నారు. లేకపోతే దేశంలో భవిష్యత్తులో మరిన్ని పోరాటాలు రాక తప్పవని అన్నారు. ఫిబ్రవరి 12 న జరిగే సమ్మె దేశభక్తి సమ్మె అని ఆయన అన్నారు. ప్రజల కోసం జరుగుతున్న సమ్మె అని ఆయన అన్నారు. అందుకే ఈ సమ్మెలో కార్మికులు, ఉద్యోగులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమ్మె వివిధ కేంద్ర కార్మిక సంఘాలు మరియు వివిధ ఫెడరేషన్లు, ఇన్సూరెన్స్, బ్యాంకు, ఎంప్లాయిస్ సంఘాల ఆధ్వర్యంలో భారీ ఎత్తున సమ్మె జరగనున్నదని ఆయన అన్నారు. కార్మిక, ఉద్యోగ సంఘాలు సమ్మెకు పిలుపునిచ్చాయని ఆయన అన్నారు. మోడీ ప్రభుత్వం తక్షణమే లేబర్ కోడులను రద్దు చేయాలని, అలాగే ఉపాధి హామీ పథకం లో తెచ్చిన మార్పులను ఉపసంహరించుకోవాలని, విత్తన బిల్లును రద్దు చేయాలని, ఇన్సూరెన్స్ రంగంలో 100% ఎఫ్ డి ఐ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మె సందర్భంగా కార్మికులు వివిధ రూపాలలో పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని, సమ్మె రోజు పెద్ద ఎత్తున కార్మికు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కే రాజయ్య, మాణిక్యం, శాంత కుమార్, హరినాథ్, యాదగిరి, కృష్ణారెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సీబీఐ నివేదికతో కూటమీ రాజకీయాల బండారం బహిర్గతం

**భక్తుల మనోభావాలతో ఆటలాడారు, క్షమాపణలు చెప్పాల్సిందే.**

**వైసిపి రైతు విభాగపు రాష్ట్ర కార్యదర్శి తుగ్గలి శ్రీనివాస్ రెడ్డి.**

**తుగ్గలి:** తిరుపతి టీటీడీ లడ్డూ వివాదంపై సీబీఐ విచారణ నివేదిక వెలువడిన నేపథ్యంలో అధికార కూటమిపై వైసీపీ నేతలు తీవ్రస్థాయిలో ఎదురుదాడికి దిగారు. లడ్డూ తయారీలో జంతువుల కొవ్వు కలవలేదని సీబీఐ స్పష్టంగా పేర్కొనడంతో,ఈ మొత్తం వివాదం రాజకీయ దురుద్దేశంతోనే సృష్టించారని వైసీపీ నేతలు ఆరోపించారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా చంద్రబాబు నాయుడు,పవన్ కళ్యాణ్ కావాలనే తప్పుడు ప్రచారం చేశారని మండిపడ్డారు. మండల కేంద్రమైన తుగ్గలిలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే తమ్మారెడ్డి కుమారుడు వైసిపి రైతు విభాగపు రాష్ట్ర కార్యదర్శి తుగ్గలి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ దేశ చరిత్రలో దేవుడిని కూడా రాజకీయాలకు వాడుకున్న దుర్బుద్ధి చంద్రబాబుకే సొంతం అన్నారు. టీటీడీ లడ్డులో పంది కొవ్వు కలిసిందంటూ ప్రచారం చేసి భక్తుల విశ్వాసాలను దెబ్బతీశారని,చంద్రబాబు మాట విని దుర్గగుడి మెట్లు కడిగిన పవన్ కళ్యాణ్ ఇప్పుడు మళ్లీ వచ్చి మెట్లు కడిగి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. గత ఏడాది వరదల సమయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని,ఆ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే టీటీడీ లడ్డూ వివాదాన్ని తెరపైకి తెచ్చారని శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. సీబీఐ రిపోర్ట్ వచ్చిన తర్వాత ఒక్క కూటమి నేత కూడా మాట్లాడలేని పరిస్థితి వచ్చిందన్నారు. టీటీడీ ప్రతిష్టను ప్రపంచ వ్యాప్తంగా తీసుకెళ్లిన ఘనత జగన్ మోహన్ రెడ్డిదేనని స్పష్టం చేశారు. టీటీడీ లడ్డూ అంశంపై చంద్రబాబు,పవన్ నీచ రాజకీయాలు చేస్తున్నారని,సనాతన ధర్మం పేరుతో అపచారం చేసి భక్తుల్లో ఆందోళనలు సృష్టించారన్నారు. సీబీఐ స్పష్టంగా జంతువుల కొవ్వు కలవలేదని తేల్చినా కూడా కూటమి నేతలకు సిగ్గు రావడం లేదని మండిపడ్డారు. చంద్రబాబు,పవన్ కళ్యాణ్ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో చెంపలు వేసుకుని క్షమాపణలు చెప్పాలని,అలిపిరి మెట్లు కడిగినంత మాత్రాన వారికి ప్రాయశ్చిత్తం కాదని వ్యాఖ్యానించారు.

# ఐదు కిలోల గంజాయి ముఠా పట్టివేత



ఐదుగురు నిందితులు అరెస్ట్ 5 సెల్ ఫోన్లు స్వాధీనం

**మిర్యాలగూడ ఫిబ్రవరి 1 :- (ప్రభాత సూర్య):** నిషేధిత గంజాయిని అక్రమంగా విక్రయిస్తున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుండి 5 కేజీల గంజాయితో పాటు ఐదు సెల్ ఫోన్ లను స్వాధీనం పరుచుకున్నట్లు మిర్యాలగూడ డి.ఎస్.పి రాజశేఖర్ రాజు తెలిపారు. ఆదివారం మిర్యాలగూడ సబ్ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. దామరచర్ల మండలం వీర్లపాలెం సమీపంలో గల యాదాద్రి పవర్ ప్లాంట్ వద్ద బీహార్ రాష్ట్రానికి చెందిన ఇంద్రజిత్ కుమార్, ప్రిన్సి యాదవ్, కన్నయ్య కుమార్ పాశ్వాన్, కమలేష్ యాదవ్, మన్ మిత్ సింగ్ అను ఐదుగురు వ్యక్తులు బీహార్ రాష్ట్రం నుండి గంజాయిని తీసుకువచ్చి రెండు గ్రాముల చొప్పున ఒక ప్యాకెట్ తయారు చేసి రూ. 100 కు విక్రయించేందుకు 1500 ప్యాకెట్లను సిద్ధం చేశారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం తమ పోలీస్ సిబ్బందితో ప్యాకెట్ల రూపంలో విక్రయించడానికి సిద్ధంగా ఉన్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా అసలు విషయం వెల్లడించారన్నారు. వీరు వినియోగించి సేవించడం కోసం తీసుకొచ్చిన గంజాయిని అమ్ముకొని సొమ్ము చేసుకోవాలని దురాశ కలగడంతో వైటీపీఎస్ లో పనిచేస్తున్న తోటి కార్మికులకు అమ్మేందుకు చూసామని నేరాన్ని అంగీకరించారు. వీరి వద్ద నుండి ఐదు కేజీల గంజాయి ముడి సరుకు తో పాటు, 1500 గంజాయి ప్యాకెట్లు, ఐదు సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకొని రిమాండ్కు తరలించినట్లు తెలిపారు. కేసును చాకచక్యంగా చేదించిన రూరల్ సీఐ పీఎండి ప్రసాద్, వాడపల్లి ఎస్సై శ్రీకాంత్ రెడ్డి, పోలీస్ సిబ్బంది సంతోష్ రెడ్డి, చంద్రశేఖర్ గౌడ్, రషీద్, విక్రమ్ లను డిఎస్పి అభినందించారు.

## సిట్ విచారణకు సహకరించాలి రాజకీయాలు మానలి
## బుగ్గ నవీన్, కాంగ్రెస్ మండల నాయకులు....



**ఆలేరు ఫిబ్రవరి 1 ప్రభాత సూర్య....:** ఆలేరు మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల నాయకులు బుగ్గ నవీన్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు చూసి ఓర్వలేక తెలంగాణ ఆత్మగౌరన్ని దెబ్బతీసేలా సంఘవిద్రోహ శక్తులు, టెర్రరిస్టుల పేరుతో రాజ్యాంగాన్ని రక్షించే జడ్జిలు, లాయర్లు మరియు రాజకీయ నాయకుల ఫోన్ ల తోపాటు వేల ఫోన్లు ట్యాప్ చేసి తమ నాయకుడు ఏదో గొప్ప పని చేసినట్టు ాౌ విచారణ కు హాజరైతుంటే బిఆర్ఎస్ నాయకులు నిరసనలు చేయడం తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీయడమే అన్నారు. మిగులు బడ్జెట్ తో ఉన్న తెలంగాణ ను ఫోన్ ట్యాపింగ్ ముసుగులో రాష్ట్రాన్ని అప్పుల్లోకి నెట్టి తమ కుటుంబ ఆస్తులు, పార్టీ ఆస్తులు పెంచుకోవడమే కాకుండా కొంతమంది వ్యక్తిగత జీవితాలే కాకుండా అనేక కుటుంబాలను విచ్చిన్నం చేశారన్నారు. కేసీఆర్ కూతురే తమ భర్త ఫోన్ ట్యాపింగ్ చేసి ఇబ్బందులు పెట్టారని చెప్తున్నారని రాజ్యాంగ బద్ధంగా జరుగుతున్న విచారణకు సహకరించి తమ చిత్తశుద్ధి ని నిరూపించుకోవాలని అన్నారు. ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్ ఉందని మర్చిపోయి కేసీఆర్ రాష్ట్ర సమస్యలపై మాట్లాడుటకు అసెంబ్లీకి వెళ్తున్నట్లు నిరసనలు చేయడమెంటని ప్రశ్నించారు. చట్టానికి ఎవరు అతిధులు కారని అందరూ సమానమేనని రాజకీయాలు చేయకుండా విచారణ సహకరించాలని, మీ పార్టీ రాజకీయ భవిష్యత్ కోసం రాష్ట్రంలో ప్రజాసమస్యలపై పోరాటాలు చేయాలని సూచించారు.



## కెసిఆర్ పై సీట్ విచారణను నిరసిస్తూ ఆలేరు లో నల్ల బ్యాడ్జీలతో నిరసన.....

**ఆలేరు ఫిబ్రవరి 1 ప్రభాత సూర్య:** ఆలేరు మున్సిపాలిటీ పరిధిలో మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పై ఫోన్ ట్యాపింగ్ పేరిట కొనసాగుతున్న సీట్ విచారణను ఖండిస్తూ బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను గౌరవించకుండా అరాచక పాలన చేస్తున్నారని, అనేక అక్రమ కేసులు పెట్టి బిఆర్ఎస్ పార్టీని అనగదొక్కాలని చూస్తున్నారని అన్నారు. ప్రజల కోసం ఉద్యమించి తెలంగాణ సాధించిన నాయకుడు పై కక్షపూరితంగా కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు. ఫోన్ టాపింగ్ కేసి పేరిట కెసిఆర్ ను రాజకీయంగా వేధించాలని ప్రయత్నం జరుగుతుందని ఆరోపించారు. ప్రతిపక్ష నాయకుడిగా కెసిఆర్ ప్రజల తరఫున ప్రశ్నిస్తుండటాన్ని తట్టుకోలేక నోటీసులు జారీ చేశారని వాక్యానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, పిఎసిఎస్ మాజీ వైస్ చైర్మన్ చింతకింది చంద్రకళ మురహరి,సీనియర్ నాయకులు జంపాల దశరథ, జూకంటి ఉప్పలయ్య, బేతి రాములు, కర్రె అశోక్, మాదాసు ఫిలిప్స్, కందుల శంకర్, బీజాని మధు, పోరెడ్డి శ్రీనివాస్, పాశికంటి శ్రీనివాస్, యాట శివ, మూర్తల రమణారెడ్డి, బింగి రవి, కుండె సంపత్ , జూకంటి సంపత్, గట్టు రాజు, పాకల హరీష్ , కటకం బాలరాజు, బాసాని ప్రశాంత్, ఎండి జమాల్, మొరిగాడి వెంకటేష్ మాధవి, క్యాసగల్ల అనసూయ, సీస మహేశ్వరి, మొరిగాడి ఇందిర, విజయ జ్యోతి, యాట జయ, లావణ్య, కవిత, మౌనిక, తదితరులు పాల్గొన్నారు

## నన్ను గెలిపించండి 7వ వార్డును అభివృద్ధి చేస్తా..
## కాంగ్రెస్ అభ్యర్థి బీజని బాలమణి భాస్కర్....



**ఆలేరు ఫిబ్రవరి 1 ప్రభాత సూర్య.:** ఆలేరు మున్సిపాలిటీ పరిధిలోని పదవ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి బీజని బాలమణి భాస్కర్ ఆదివారం రోజున ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బలమణి భాస్కర్ మాట్లాడుతూ గత పది సంవత్సరాలలో నుండి ఈ వార్డు అభివృద్ధికి నోచుకోలేదని నన్ను గెలిపిస్తే అన్ని విధాలుగా అభివృద్ధి తెలిపారు. తనను 7వ వార్డు నుండి గెలిపిస్తే అన్ని సమస్యలను పరిష్కరిస్తూ వార్డును అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. వార్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, సిసి రోడ్లు, వీధిలైట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. వార్డులో మంచినీటి సమస్య తీరుస్తానని తెలిపారు. 7వ వార్డులో ఎవరెవరికి పెన్షన్ రావడం లేదు వారందరికీ పెన్షన్ అందే విధంగా చర్యలు చేపడతానని అన్నారు. రేషన్ కార్డు లేని వారికి రేషన్ కార్డులు అందే విధంగా చర్యలు చేపడతానని తెలిపారు. ఆలేరు ఎమ్మెల్యే బీర్లా ఐలయ్య సహాయ సహకారాలతో వార్డు అభివృద్ధి కోసం నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో 7వ వార్డ్ నుంచి నన్ను అత్యధిక మెజార్టీతో గెలిపించలని వారు ఓటర్లను కోరారు.

## పటాన్చెరు బి.ఆర్. ఎస్. పార్టీ ఇచ్చార్జ్ ఆదర్శ రెడీ ఆధ్వర్యంలో దర్న



**రామచంద్రపురం ఫిబ్రవరి 1ప్రభాత సూర్య :** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు మండలం రామచంద్రపురం మండలం లోని రహదారి పక్కన నువున్న అంబేత్కర్ వొగ్రహం వద్దు బైటయించి నిరసన నిర్వహించారు. కే.సీ. ఆర్. కి చిట్టింగ్ నోటీసు నందువలన రామచందపురం లోని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించిన నిరసన వ్యక్తం చేశారు ఆదర్శ రెడీ మాట్లాడుతూ, మా నాయకుడు కే. సీ. ఆర్. మీద అబండాలు వేస్తున్నారు ఎలక్షన్ లొ గెలవడం కోసం కుట్రలు చేస్తున్నారు, అని అన్నారు. మా నాయకుని మీద బురద చాల్లే అని మీరు ఎంత ఇబ్బంది పెట్టిన భయపడేది లేదని అన్నారు. ఈ కార్యక్రమం లో మాజీ కార్పొరేటర్ తొంటా అంజయ్య, పరమేష్ స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ అన్నపూర్ణేశ్వరి నిత్య అన్నప్రసాద సేవ ట్రస్టు షష్టి వార్షికోత్సవంలో పాల్గొన్న సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి



**సంస్థాన్ నారాయణపురం,ఫిబ్రవరి 01(ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని గుడిగుట్ట లోని శ్రీశ్రీశ్రీ అన్నపూర్ణేశ్వరి ఆశ్రమం పీఠాధిపతి శ్రీ శ్రీ శంకరనంద స్వామి ఆధ్వర్యంలో శ్రీ అన్నపూర్ణేశ్వరి సమేత కాశి విశ్వనాధ కళ్యాణ మహోత్సవము, శివస్వాములచే ద్వాదశ జ్యోతిర్లింగాల మహా పడి పూజ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుండి గురు స్వాములు శివ స్వాములు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## కేసీఆర్ పై సిట్ విచారణను నిరసిస్తూ సాయి గూడెం గ్రామంలో ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం సాయి గూడెం గ్రామంలో తెలంగాణ రాష్ట్ర జాతిపిత,తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పై ఫోన్ ట్యాపింగ్ పేరిట కొనసాగుతున్న సిట్ విచారణను తీవ్రంగా నిరసిస్తూ, ఆదివారం సాయి గూడెం గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు గంగాధరి సుధీర్ కుమార్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయ కక్ష సాధింపు చర్యలకు వ్యతిరేకంగా ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు.నిరసనలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ,కేసీఆర్ తెలంగాణ ప్రజల కోసం పనిచేసిన నాయకుడని,ఆయనపై తప్పుడు కేసులు పెట్టి ఇబ్బంది పెట్టడం తెలంగాణ ప్రజల ఆత్మగౌరవంపై దాడి అని అన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ విచారణను నిలిపివేయాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు.బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు శాంతియుతంగా నిరసన చేపట్టి ప్రభుత్వ చర్యలను తీవ్రంగా ఖండించారు. ఈ నిరసన కార్యక్రమంలో పాల సెంటర్ చైర్మన్ ఉదరి రాములు, వార్డ్ మెంబర్ బండి పృథ్వి రాణి శ్రీనివాస్, మొగుళ్ల దేశాయిరెడ్డి, బీజని బాలురాజ్,ఇంజ రాజు, మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు కొండ చంద్రారెడ్డి, ముద్దేపాక లక్ష్మయ్య, పుట్ట పవన్, గోపు మహేందర్ రెడ్డి, ముద్దేపాక నరసయ్య, అంజద్, గంగాధరి సత్తయ్య, సంగీ స్వామి, కళ్లెం రవి, ముద్దేపాక శీను, ఆలేటి నరసయ్య, బొడ్డు మహేందర్, ముద్దేపాక రత్నాకర్, ముద్దేపాక నరేందర్, ముద్దేపాక కృష్ణ, మక్బుల్, ఎర్ర నాగేష్, గోవిందు బిక్షపతి, ముద్దెపాక కర్ణాకర్,గ్రామస్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## నన్ను గెలిపిస్తే 10వ వార్డును అభివృద్ధి చేస్తా..
## కాంగ్రెస్ అభ్యర్థి మల్లెల సరితా శ్రీకాంత్...



**ఆలేరు ఫిబ్రవరి 1 ప్రభాత సూర్య:** ఆలేరు మున్సిపాలిటీ పరిధిలోని పదవ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి మల్లెల సరితా శ్రీకాంత్ ఆదివారం రోజున ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సరిత శ్రీకాంత్ మాట్లాడుతూ గత పది సంవత్సరాలలో నుండి ఈ వార్డు అభివృద్ధికి నోచుకోలేదని నన్ను గెలిపిస్తే అన్ని విధాలుగా అభివృద్ధి తెలిపారు. తనను 10 వార్డు నుండి గెలిపిస్తే అన్ని సమస్యలను పరిష్కరిస్తూ వార్డును అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. వార్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, సిసి రోడ్లు, వీధిలైట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. వార్డులో మంచినీటి సమస్య తీరుస్తానని తెలిపారు. పదవ వార్డులో ఎవరెవరికి పెన్షన్ రావడం లేదు వారందరికీ పెన్షన్ అందే విధంగా చర్యలు చేపడతానని అన్నారు. రేషన్ కార్డు లేని వారికి రేషన్ కార్డులు అందే విధంగా చర్యలు చేపడతానని తెలిపారు. ఆలేరు ఎమ్మెల్యే బీర్లా ఐలయ్య సహాయ సహకారాలతో వార్డు అభివృద్ధి కోసం నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో పదవ వార్డ్ నుంచి నన్ను అత్యధిక మెజార్టీతో గెలిపించలని వారు ఓటర్లను వేడుకున్నాడు.

## వార్డు అభివృద్ధి లక్ష్యంగా మీ ముందుకు వస్తున్న దీవించండి...
## మోరిగాడి రమేష్ సిపిఎం 3 వ వార్డు అభ్యర్థి......



**లేరు ఫిబ్రవరి 1 ప్రభాత సూర్య:** ఆదివారం రోజున ఆలేరు మున్సిపాలిటీలోని 3 వ వార్డు కాటమయ్యబస్తీ మహాలక్ష్మి రైస్ మిల్ సుభాష్ నగర్ ఆదర్శ్ నగర్ ప్రాంతంలో సిపిఎం అభ్యర్థి మోరిగాడి రమేష్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ నెల 11న రానున్న ఎన్నికల్లో 3వ వార్డు అభ్యర్థిగా తలను గెలిపిస్తే ఈ ప్రాంతంలో ఉన్నటువంటి ప్రధాన సమస్యలు మురికి కాలువ నిర్మాణం సీసీ రోడ్ల నిర్మాణం తోపాటు అనేక ప్రాంతాలు అంధకారమై ఉన్నటువంటి చోట్ల వీధి దీపాలు ఏర్పాటు చేయడమే కాకుండా వార్డులోని పేదలందరికీ ఇండ్లు ఇండ్ల స్థలాలు పెన్షన్లు తదితర సమస్యలపై పాలక సమస్యను పరిష్కారమే అయ్యేవిధంగా ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్తామని నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి వార్డు అభివృద్ధికి తోడ్పడుతానని తెలిపారు. ఈ సందర్భంగా ఇంటింటికి ప్రచారంలో 3వ వార్డ్ ఓటర్లకు హామీ ఇచ్చారు. ఓటర్ల నుండి అనూహ్యమైన స్పందన వచ్చిందని ,గతంలో గెలిచిన వాళ్ళు మళ్ళీ కనబడకుండా పోయారని మా సమస్యను పరిష్కారం కావాలంటే మీలాంటి ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న అభ్యర్థులే ఎన్నికల్లో గెలవాలని పలువురు ఓటర్లు నీరాజనాలు పలికారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు ఎంఏ ఇక్బాల ,సిపిఎం నాయకులు మోరిగాడి అజయ్, ఘనగాని మల్లేష్ గౌడ్,వడ్డేమాన్ బాలరాజు, చేన్న రాజేష్, గజ్జల నరసింహులు, మోరీగాడి రాజు, అయిలి అంజమ్మ శ్వేతా రెడ్డి, కంసాని రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బాజినేని రత్తయ్య ఉద్యోగ విరమణ వేడుక

## రత్తయ్య అందించే సేవలను కొనియాడిన తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఏలూరు శ్రీనివాసరావు



**ఖమ్మం( ప్రభాత సూర్య ప్రతినిధి ):** వైద్య ఆరోగ్య శాఖ లో బాజినేని రత్తయ్య 35 సంవత్సరాలు ల్యాబ్ టెక్నీషియన్ గా పనిచేసి గవర్నమెంట్ హాస్పిటల్, ఖమ్మం నుండి గ్రేడ్-1 ల్యాబ్ టెక్నిషియన్ గా ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా నిన్న ఖమ్మం టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్ లో పదవీ విరమణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు.వైద్య శాఖలో ల్యాబ్ టెక్నీషియన్ గా ఆయన అందించిన సేవలను తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఏలూరు శ్రీనివాసరావు కొనియాడారు. ఈ సందర్భంగా టీఎన్జీవోఎస్ జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి ల్యాబ్ టెక్నీషియన్ గా విధులు నిర్వహించిన ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. బాజినేని రత్తయ్య రెండుసార్లు ఉత్తమ ఉద్యోగిగా అవార్డు సైతం పొందారు. వారి కూతురు అలేఖ్య కుమారుడు అనూప్ ఉన్నత విద్యను అభ్యసించి విదేశాల్లో సాఫ్ట్వేర్ ఉద్యోగాలలో సెటిలైనారు.ఈ సందర్భంగా బాజినేని రత్తయ్య - రత్నకుమారి దంపతులను టీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఏలూరు శ్రీనివాసరావు టీఎన్జీవో ఖమ్మం జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు ఉద్యోగ సంఘ నాయకులు ఘనంగా సత్కరించారు. ఘన సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ ఫుడ్ ఇన్స్పెక్టర్ రాయపూడి కిరణ్ కుమార్ టిఎన్జీవోఎస్ నాయకులు జెడ్ ఎస్ జైపాల్ ల్యాబ్ టెక్నీషియన్ సంఘం నాయకులు పలువురు పాల్గొన్నారు.



# ఆదరించండి 5వ వార్డును అన్ని విధాల అభివృద్ధి చేస్తా.. బిజెపి అభ్యర్థి పాశికంటి సంపత్..

**ఆలేరు ఫిబ్రవరి 1 ప్రభాత సూర్య:** ఆలేరు మున్సిపాలిటీ పరిధిలోని 5 వ వార్డులో బిజెపి అభ్యర్థి పాశికంటి సంపత్ కార్యకర్తలతో విస్తృత ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ప్రచార భాగంగా వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు . సంపత్ మాట్లాడుతూ తనను 5 వ వార్డు నుండి గెలిపిస్తే అన్ని సమస్యలను పరిష్కరిస్తూ వార్డును అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. వార్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, సిసి రోడ్లు, వీధిలైట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి వైద్య శిబిరాన్ని కూడా ఏర్పాటు చేస్తానని తెలిపారు. వార్డులో మంచినీటి సమస్య లేకుండా చేస్తానని అన్నారు.. మున్సిపాలిటీ ఎన్నికల్లో 5 వ వార్డ్ నుంచి నన్ను అత్యధిక మెజార్టీతో గెలిపించలని ఆయన ఓటర్లను వేడుకున్నాడు.

# నర్సాపూర్ అభివృద్ధే లక్ష్యంగా మున్సిపల్ ఎన్నికల ప్రచారం..

## ఆవుల రాజిరెడ్డి కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్





**ప్రభాత సూర్య నర్సాపూర్ ఫిబ్రవరి 01:** నర్సాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా పట్టణంలోని 08వ,15వ వార్డులలో ఎన్నికల ప్రచార కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నర్సాపూర్ పట్టణ సమగ్ర అభివృద్ధే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటికి శాశ్వత పరిష్కారాలు చూపడమే కాంగ్రెస్ పార్టీ విధానమని తెలిపారు. ప్రజల విశ్వాసం, మద్దతుతో ఈ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.అనంతరం నర్సాపూర్ మండలం నాగులపల్లి గ్రామానికి చెందిన ఒక వార్డు మెంబర్తో పాటు పలువురు దీ=ా పార్టీ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఆవుల రాజిరెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.ఈ ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# 31 డివిజన్లో ఇంటింటికి ప్రచారం

## కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కౌసర్, ఖయ్యూం బేగ్



**నల్గొండ ప్రభాత సూర్య :** నల్లగొండ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సహకారంతో 31 డివిజన్ని మరింత అభివృద్ధి చేయడం జరుగుతుందని కౌసర్, ఖయ్యూం బేగ్ అన్నారు. ఆదివారం నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ 31 డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థి కౌసర్, ఖయ్యూం బేగ్ 31వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి ను గెలిపించాలని కోరుతూ కార్పొరేటర్ అభ్యర్థి కౌసర్, వారి తండ్రి ఖయ్యూం బేగ్ అభ్యర్థులు,పార్టీ శ్రేణులు ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలు వివరిస్తూ ఇంటింటికి ప్రచారం నిర్వహించిన ఈనెల 11న జరిగే కార్పొరేషన్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కౌసర్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డు, 200 యూనిట్ ల కరెంటు, రైతు భరోసా, ఉచిత బస్సు, సన్నబియ్యం తదితర ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో 31 డివిజన్ లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించి అధికార పార్టీకి మరింత బలం ఇవ్వాలని కోరారు. ఈ ప్రచారంలో కాలనీవాసులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు

# పిఎంజే జ్యూవెలర్స్ లో సితార సందడి

నవ్వుల సితార పీఎంజే జ్యువెలర్స్ బ్రాండ్ అంబాసిడర్ ఘట్ట మనేని సితార నగరంలో సందడి చేసింది. హాఫ్-శారీ ఫ్యాషన్ షోలో తళుక్కున మెరిసింది.బంజారాహిల్స్ లో హోటల్ తాజ్ కృష్ణా వేదికగా పీఎంజే జ్యువెలర్స్ ఆధ్వర్యం లో నిర్వహించిన ఆభరణాల ప్రదర్శన నగరవాసులును ఆకట్టుకుంది. ఫిబ్రవరి 2 వరకూ జరిగే ఈ ప్రత్యేక ఎగ్జిబిషన్లో 10,000కు పైగా డిజైనర్ ఆభరణాలు అందుబాటులో ఉన్నాయని చైర్మన్ కుషాల్ కాంకారియా తెలిపారు. నిర్వహించిన ప్రారంభ కార్యక్రమంలో పీఎంజే జ్యువెలర్స్ బ్రాండ్ అంబాసిడర్ ఘట్టమనేని సితార పాల్గొని సందడి చేశారు. ఇదే వేదికగా చిన్నారులతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హాఫ్ శారీ ఫ్యాషన్ షోలో పిల్లలతో పాటు సితార లగ్జరీ డిజైనరీ ఆభరణాలను ప్రదర్శించారు. వివా హాలు, హాఫ్ శారీ వేడుకలు, శుభకార్యాల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఎక్స్పురియన్స్ జోన్లు, పర్సనలైజ్డ్ స్టైలింగ్, డైమండ్ టెస్టింగ్ జోన్ ఈ ప్రదర్శనకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

# 30 శాతంమధ్యంతర భృతి(ఐ ఆర్) ప్రకటించాలి: ఎస్ టి యు.

రుద్రవరం: ఎస్ టి యుదశల వారి ఉద్యమం లో భాగంగా పిఆర్సి ని ఏర్పాటు చేసి తక్షణం 30 శాతం ఐ ఆర్ ప్రకటించి మేనిఫెస్టో లో పేర్కొన్న మెరుగైన పిఆర్సి మరియు సిపిఎస్ రద్దు తదితర పెండింగ్ బకాయిల విడుదల ఉపాధ్యాయ ఉద్యోగ పెన్షనర్ల కు ఇచ్చిన హామీల ను ప్రభుత్వం అమలు చేయాలి అని ఎస్ టి యు ఏపీ రుద్రవరం మండల శాఖ ఆధ్వర్యంలో , రుద్రవరం తాసిల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ ఆదిశేషయ్య కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా సిపిఎస్ కన్వీనర్ సుబ్బయ్య మాట్లాడుతూ ఎస్టియుఆధ్వర్యంలో ఫిబ్రవరి -10 న జిల్లా కేంద్రాలలో తలపెట్టిన ధర్నాకు అలాగే ఫిబ్రవరి25 న ఛలో విజయవాడ కార్యక్రమానికి ఉద్యోగులు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# ముగిసిన శ్రీ సిద్దేశ్వర స్వామి జాత్ర ఉత్సవాలు.

హొళగుంద: మండల కేంద్రంలో స్థానిక కొండ గుహాలో స్వయంభువుగా వెలసిన శ్రీ సిద్దేశ్వర స్వామి జాత్ర ఉత్సవాలు శుక్రవారం వసంతోత్సవంతో వైభవంగా ముగిశాయి.ప్రధానంగా చివరి రోజు అయిన శుక్రవారం శ్రీవారి సన్నిధిలో స్వామివారికి ఉదయం నుంచి వంశపారంపర్యం ఆలయ ధర్మకర్త రాజా పంపన్న గౌడ ప్రత్యేక పూజలు నిర్వహించారు.అలాగే సాయంత్రం స్వామి వారి ఆలయం నుంచి కొట్టూరు బసవేశ్వర స్వామి దేవాలయం వరకు స్వామివారి ఉత్సవ విగ్రహ మూర్తులను పూల పల్లకిలో ఉంచి,మేళా తాళతో, సకల వాయిద్యాల నడుమ పురవిధుల గుండా ఊరేగింపుగా తరలి వెళ్లారు.

# మున్సిపల్ ఎలక్షన్లలో నామినేషన్ వేసే తేదీని పొడిగించాలి

## బిసి రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ డిమాండ్

హైదరాబాద్ జనవరి: మున్సిపల్ ఎలక్షన్లలో నామినేషన్ వేసే తేదీని పొడిగించాలని బిసి రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ డిమాండ్ చేశారు. హైదరాబాద్ బాగ్ లింగంపల్లి లోని సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ కుంభమేళాగా పిలిచే మేడారం జాతర జరుగుతున్న నేపథ్యంలో .. పోటీ చేయాలనుకున్న బిసి , ఎస్సి , ఎస్టీ ఆశావహులు మొక్కులలో నిమగ్నమైన వేళ నేటితోనే ఈ గడువును ముగించడం అట్టడుగు వర్గాల మనోభావాలను పరిగణన లోకి తీసుకోకపోవడమేనన్నారు..ఆర్టికల్ 324 ద్వారా ఏర్పాటైన ఎన్నికల కమిషన్ ఫ్రీ అండ్ ఫెయిర్ గా నిర్వహించాల్సిన ఎన్నికలను ఇంత హడావిడిగా నిర్వహించడం రాజ్యాంగ విలువలను భేఖాతరు చేయడమేనన్నారు..ముఖ్యమంత్రి రాష్ట్రంలో అందుబాటులో లేని సమయంలో ఎన్నికల కమిషన్ తన తీసుకున్న ఈ నిర్ణయాన్ని పునరాలోచించి నామినేషన్ గడువును పొడిగించాలన్నారు.. ఇందుకోసం తాము న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు ..42 శాతం బీసీ రిజర్వేషన్ల అంశం రాష్ట్ర హై కోర్ట్ పరిధిలో ఉండగానే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రభుత్వం నిర్వహించినా,పార్టీల గుర్తుతో సంబంధం లేని దృష్ట్యా,కేంద్ర ప్రభుత్వ నిధులు,స్థానిక పారిశుధ్య సమస్యల రీత్యా తాము ప్రభుత్వానికి సహకరించామన్నారు..బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు సాధ్యం కాకముందే ఇప్పుడు పార్టీ గుర్తుపై జరిగే మున్సిపల్ ఎన్నికలనుహడావిడిగా నిర్వహించడం వలన బీసీలు పెద్దఎత్తున నష్ట పోయే అవకాశం ఉందన్నారు..త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా బీసీ రాజకీయ చైతన్య యాత్రను నిర్వహించి బీసీ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ వీ జీ ఆర్ నారగోని తెలిపారు..మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న బిసి అభ్యర్థులకు ... తమ సంస్థ ఆధ్వర్యంలో గుర్తింపు ఉన్న ఒక రాజకీయ పార్టీ నుండి బీఫామ్ ఇప్పించి ,గెలిపించుకుంటామని స్పష్టం చేశారు.

# జాతి కోసం నిలబడి కొట్లాడిన వీరవనితలు.. సమ్మక్క, సారలమ్మలు

## గోవింద రాజు, పడిగిద్ద రాజుల వంశంలో గొప్ప సైనికులు: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

మేడారం జాతి కోసం నిలబడి కొట్లాడిన వీరవనితలు.. సమ్మక్క, సారలమ్మలని,గోవింద రాజు, పడిగిద్ద రాజుల వంశంలో గొప్ప సైనికులు: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత పేర్కొన్నారు.శుక్రవారం సమ్మక్క, సారలమ్మలను దర్శించుకున్న తర్వాత మీడియాతో మాట్లాడారు.తెలంగాణ ప్రజలు బాగుండాలని సమ్మక్క, సారలమ్మలను కోరుకోవటం జరిగింది.కాకతీయుల వంటి రాజులతో కొట్లాడిన వనదేవతలు సమ్మక్క, సారలమ్మలు. వారి జాతి కోసం నిలబడి కొట్లాడిన వీరవనితలు. గోవింద రాజు, పడిగిద్ద రాజుల వంశంలో గొప్ప సైనికులు. అని కొనియాడారు.వారి స్ఫూర్తితోనే మేము తెలంగాణ ప్రజల కోసం పోరాటం చేస్తాం. తెలంగాణ వచ్చిన 12 ఏళ్ల తర్వాత కూడా నీళ్లు, నిధులు, నియామకాలు అందని పరిస్థితి ఉంది. సామాజిక న్యాయం అందరికీ ఇప్పటికీ దక్కలేదు. ఈ పరిస్థితి పోయేలా మేము జాగృతి తరఫున మా వంతు కృషి చేస్తామన్నారు.

# సార్వత్రిక విద్యకు దూరంగా బడ్జెట్ కేటాయింపులు

## టిఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ రంజాన్



**ఖమ్మం( ప్రభాత సూర్య ప్రతినిధి ):** కేంద్ర బడ్జెట్ లో విద్యారంగానికి కేటాయింపులు సార్వత్రిక విద్యా సాధన లక్ష్యానికి దూరంగా ఉన్నాయని టిఎస్ యుటిఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు షేక్ రంజాన్ అన్నారు. గత సంవత్సరం 1,28,650 కోట్లు కేటాయించగా ఈ సంవత్సరం 1,39,289 కోట్లు కేటాయించారు. అంకెల్లో స్వల్ప పెరుగుదల ఉన్నప్పటికీ మొత్తం బడ్జెట్ దామాషాలో తక్కువగానే ఉంటుంది. పెరిగిన ధరలతో పోలిస్తే మధ్యాహ్నం భోజనం, సమగ్ర శిక్ష కు కెటాయించిన బడ్జెట్ ఏమాత్రం సరిపోదు. జాతీయ విద్యా కమీషన్ సిఫారసు చేసిన విధంగా బడ్జెట్లో 10%, జిడిపిలో 6% కేటాయింపుకు అందనంత దూరంలో ప్రస్తుత కేటాయింపులు ఉన్నాయి. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు, సమగ్ర శిక్ష ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయడానికి వీలుగా బడ్జెట్ కేటాయింపులు పెంచాలని టిఎస్ యుటిఎఫ్ డిమాండ్ చేసిందిఉద్యోగులకు దక్కని ఊరట కేంద్ర బడ్జెట్ లో ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితి పెరుగుతుందని ఆశించిన ఉద్యోగులకు ఊరట లభించలేదు. గత సంవత్సరం తీసుకువచ్చిన ఆదాయపన్ను చట్టం ప్రకారమే పన్ను స్లాబులు ఉంటాయని ప్రకటించటం అన్యాయం. గత 12 సంవత్సరాలుగా ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితి పెంచలేదు. సేవింగ్స్ మొత్తాలపై రిబేటును పెంచలేదు. పాత విధానాన్ని కొనసాగిస్తూ, కొత్త విధానాన్ని ప్రోత్సహించడానికే కేంద్ర ప్రభుత్వం మొగ్గు చూపుతోందని విమర్శించారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.